గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 220, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, బుధవారం - 18 - సెప్టెంబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### వరుస రైలు ప్రమాదాలపై
## అమిత్ షా కీలక వ్యాఖ్యలు

రైలు ప్రమాదాల వెనుక కుట్రలు దాగి ఉంటే వెలికి తీస్తాం

ఎలాంటి కుట్రలు అయినా ఎక్కువ రోజులు దాగి ఉండవన్న అమిత్ షా

ప్రమాదాల మూల కారణాలపై దర్యాప్తు చేస్తామన్న అమిత్ షా


2

### అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు వద్దన్న
## అత్యున్నత న్యాయస్థానం

దేశవ్యాప్తంగా బుల్డోజర్ సంస్కృతిపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పలు రాష్ట్రాల్లో నేరస్తులు, సంఘ వ్యతిరేక శక్తుల ఇళ్ల కూల్చివేత

బుల్డోజర్ న్యాయం పేరిట చర్యలను నిరసిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు


2

## ముగిసిన ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం
### ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నెంబర్ క్రేన్ వద్ద గణేశుడి నిమజ్జనం

ఉదయం ఖైరతాబాద్ నుంచి ప్రారంభమైన భారీ శోభాయాత్ర

గణనాథుడిని చూసేందుకు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

కేవలం హుండీ ఆదాయమే రూ.70 లక్షలు వచ్చింది


2

# నేను ఫామ్ హౌస్ సీఎంను కాను
### ఎన్ని విమర్శలు వచ్చినా కూల్చివేతలు ఆపేదిలేదు

- ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం
- కేసీఆర్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నా
- నేను పనిచేసే సీఎంని
- హైడ్రాపై ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు
- దీని వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు




హైదరాబాద్: రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత తెలంగాణ ప్రజలదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానమని చెప్పారు. విలీనం, విమోచనం అంటూ స్వప్రయోజనాల కోసం యత్నించడం సరికాదని అన్నారు. నియంత నుంచి తెలంగాణకు విముక్తి కలిగిస్తామని ఆనాడు భరోసా ఇచ్చామని... పదేళ్ల పాటు కేసీఆర్



చెరువులు, కుంటలలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేసే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళతామని వివరించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. హైడ్రా ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. ఈమేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలి


2లో

- రాష్ట్రంలో పాలనే లేదు.. సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినం అట
- ఎంతోమంది పోరాటం వల్ల స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాం
- కులాలు, మతాలకు అతీతంగా తెలంగాణ ప్రజలు ఉంటారు
- ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తున్నారు
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలం ముందు పెట్టుకుందాం అనుకుంటే అక్కడ రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహం

## తెలంగాణకు కొత్త ఎన్నికల కమిషనర్



ఈ నెల 8న ముగిసిన ప్రస్తుత ఎన్నికల కమిషనర్ పార్థసారథి పదవీకాలం

ఆయన స్థానంలో రాణి కుముదినిని నియమించిన ప్రభుత్వం

ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు జారీ

## వైద్యుల డిమాండ్లకు తలొగ్గిన దీదీ సర్కార్..



- పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి
- కోల్‌కతా సీపీ సహా పలువురిపై వేటు
- ఐదు డిమాండ్లలో మూడింటికి మమతా సర్కార్ అంగీకరం
- మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలోని కమిటీ కార్యాచరణ


# ప్రభుత్వానికి 100 రోజులు..
### భేటీకి హాజరుకానున్న ఎన్డిఏ శాసనసభా పక్ష నేతలు..

- ఏపీ మంత్రుల ప్రోగ్రెస్ రిపోర్ట్ రెడీ-ఎవరెక్కడో తేల్చేయబోతున్న చంద్రబాబు..!
- కేబినెట్ భేటీలోనే వరద బాధితులకు సాయంపై సీఎం చంద్రబాబు ప్రకటన

అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు పూర్తవుతోంది. ఈ 100 రోజుల్లో మంత్రుల పనితీరు ఎలా ఉంది, శాఖలపై వారు పట్టు పెంచుకున్నారా లేదా, సకాలంలో శాఖాపరమైన సమీక్షలు నిర్వహిస్తున్నారా లేదా, ప్రభుత్వ విధానాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ఎవరెక్కడ ఉన్నారనే అంశంపై సీఎం చంద్రబాబు తాజా రిపోర్ట్ తెప్పించుకున్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎన్డిఏ శాసనసభ పక్ష సమావేశం నేడు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో జరగనుంది. ఈ భేటీకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందీశ్వరి హాజరయ్యే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు,



## దేశానికి ఎనర్జీ స్టోరేజ్ క్యాపిటల్ గా ఏపీని మార్చుతాం


2

- విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రెస్ గా నిలిపే లక్ష్యం
- రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నాం
- రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నాం

### మోదీకి చంద్రబాబు, రేవంత్ రెడ్డి
## శుభాకాంక్షలు
ప్రధాని మోదీ పుట్టినరోజు



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు . ఈ సందర్భంగా ఆయనకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. “గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు. దేశ సేవ చేసేందుకు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని, సంపూర్ణ జీవితాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. మోదీ విజనరీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది” అని చంద్రబాబు ట్వీట్ చేశారు. “గౌరవనీయులైన ప్రధాని మోదీ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మన దేశాన్ని పురోగతి దిశగా నడిపించేలా ఆయనకు మనోబలాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను” అని రేవంత్ ట్వీట్ చేశారు.

### ఎన్నికలు అయ్యేంత వరకే నేను ముఖ్యమంత్రిగా ఉంటాను...
# ఆ తర్వాత మళ్లీ కేజ్రీవాలే

- ఢిల్లీ కొత్త సీఎం అతిశీ
- వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక కేజ్రీవాల్ సీఎంగా బాధ్యతలు చేపడతారు
- ఇతర పార్టీల్లో ఉంటే తనకు టిక్కెట్ కూడా దక్కకపోయేదని వ్యాఖ్య
- కేజ్రీవాల్ మాత్రం తనను ఎమ్మెల్యే స్థాయి నుంచి సీఎంగా చేశారన్న అతిశీ




ఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగేంత వరకు మాత్రమే తాను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటానని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక మళ్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ బాధ్యతలు చేపడతారని అతిశీ అన్నారు. తదుపరి ఢిల్లీ సీఎంగా ఎంపికైన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తాను ఇతర పార్టీల్లో

## చంద్రబాబు అక్రమ కట్టడంలో నివసిస్తున్నారు



- చంద్రబాబు సిగ్గు విడిచిన వ్యక్తి... ఆయన ఇంటిని కూల్చాల్సిందే
- చంద్రబాబుపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించిన విజయసాయి
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంగా వ్యవహరిస్తోంది

### అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు వద్దన్న
# అత్యున్నత న్యాయస్థానం

ఢిల్లీ: దేశవ్యాప్తంగా బుల్డోజర్ సంస్కృతిపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా బుల్డోజర్ చర్యలు వద్దని స్పష్టం చేసింది. అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. అయితే, ఫుట్ పాత్ లు, రహదారుల ఆక్రమణలు, రైల్వే లైన్లు, జలవనరుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవచ్చని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా యూపీ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో సంఘ వ్యతిరేక శక్తులు, నేరగాళ్ల ఇళ్లను ప్రభుత్వాలు బుల్డోజర్లతో కూల్చివేస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. బుల్డోజర్ చర్యలకు వ్యతిరేకంగా జమాత్ ఉలేమా హింద్, తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ లతో కూడిన సుప్రీం ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. కూల్చివేతలకు ముందు నోటీసులు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా కూల్చినట్టయితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని పిటిషనర్లు కోర్టును కోరారు. కూల్చివేతలు ఆపేస్తే, ఆక్రమణల తొలగింపు ఆలస్యం అవుతుందన్న ప్రభుత్వ వాదనలను ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. యూపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'బుల్డోజర్ న్యాయం' పేరిట చర్యలు చేపట్టడం హీరోయిజం అనిపించుకోదని, అక్టోబరు 1 వరకు కూల్చివేతలు ఆపినంత మాత్రాన కొంపలు మునిగిపోయే పరిస్థితులు ఏర్పడవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను అక్టోబరు 1కి వాయిదా వేసింది.

### వరుస రైలు ప్రమాదాలపై
# అమిత్ షా కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రైలు ప్రమాదాల వెనుక ఏవైనా కుట్రలు, కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామన్నారు. ప్రభుత్వ పనితీరుపై ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏ విషయంలోనైనా ఎలాంటి కుట్రలైనా ఉంటే ఎక్కువ రోజులు దాగి ఉండవన్నారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్ వర్క్ పరిరక్షణకు తమ ప్రభుత్వం అతి త్వరలో కీలక చర్యలు తీసుకోనుందన్నారు. రైల్వే భద్రత విషయమై మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించినట్లు తెలిపారు. రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూల కారణాలపై దర్యాప్తు చేస్తామన్నారు. కారణం ఏదైనా ప్రభుత్వం వీటిపై దృష్టి సారిస్తోందన్నారు. ఇది కుట్ర అయితే ఎక్కువ కాలం కొనసాగదని స్పష్టం చేశారు. లోపాలు ఉంటే మాత్రం సరి చేస్తామని తెలిపారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయని ప్రతిపక్షం ఆరోపిస్తోందని, కానీ అవన్నీ చిన్న ఘటనలే అని స్పష్టం చేశారు. ఈ వంద రోజుల్లో ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేశామన్నారు. ఈ ప్రాజెక్టులతో దాదాపు 4.42 కోట్ల మానవ పనిదినాల ఉపాధి లభిస్తుందన్నారు. కాగా, కొన్నిరోజులుగా దుండగులు రైల్వే పట్టాలపై ఎల్పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుపరాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలు ప్రమాదాలు జరిగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి అంశాలపై అమిత్ షా స్పందించారు.

# తెలంగాణకు కొత్త ఎన్నికల కమిషనర్

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల కమిషనర్‌గా రిటైర్ ఐఏఎస్ ఆఫీసర్ రాణి కుముదిని నియమితులయ్యారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ పార్థసారధి పదవీకాలం ఈ నెల 8న ముగిసింది. దాంతో ఆయన స్థానంలో రాణి కుముదినిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్లు ఆమె ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కుమిదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

# దేశానికి ఎనర్జీ స్టోరేజ్ క్యాపిటల్ గా ఏపీని మార్చుతాం

అమరావతి: ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్-2024'లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, మానవ వనరుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ ను అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్ లో ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. దీనితో పాటు విద్యుత్ స్టోరేజి సాంకేతికత కూడా వినియోగిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ స్టోరేజి విధానంపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రస్ గా నిలిపే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ను ఎనర్జీ క్యాపిటల్‌గా గుర్తింపు తీసుకొస్తామన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున బ్యాటరీ స్టోరేజి విధానం, పంప్డ్ హైడ్రో స్టోరేజి, ఇతర అభివృద్ధి చెందిన విద్యుత్ స్టోరేజి సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్, డీ- సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి, క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని వివరించారు.

### ముగిసిన ఖైరతాబాద్
# గణేషుడి నిమజ్జనం

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఘనంగా గణనాథుల శోభాయాత్ర కొనసాగుతోంది. హుస్సేన్ సాగర్ వద్ద భారీ ఏర్పాట్లను చేశారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం హుస్సేన్ సాగర్‌లో ముగిసింది. ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నెంబర్ క్రేన్ వద్ద ఖైరతాబాద్ భారీ వినాయకుడి నిమజ్జనం జరిగింది. ఇక అంతకుముందు నిర్వాహకులు ఖైరతాబాద్ గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం సమయానికి ఎన్టీఆర్ మార్గ్ వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా.. ఖైరతాబాద్ గణేషుడి హుండీ ఆదాయం భారీగా వచ్చింది. కేవలం హుండీ ఆదాయమే రూ.70 లక్షలు వచ్చిందని నిర్వాహకులు చెప్పారు. మరోవైపు హుస్సేన్‌సాగర్ వద్ద సందడి వాతావరణం కనిపిస్తోంది. నగరం నలుమూలల నుంచి వినాయకుడి విగ్రహాల నిమజ్జనాలు ఇక్కడ జరగుతున్నాయి. వేలాది విగ్రహాలు హుస్సేన్ సాగర్‌కూ క్యూ కట్టాయి. శోభయాత్ర ఘనంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు భక్తులు. బ్యాండ్ చప్పుళ్ల మధ్య డ్యాన్సులు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య ముందుకు వస్తున్నారు. నిమజ్జనం వేడుకను చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సచివాలయం, ఐమాక్స్ మార్గాలు గణనాథుల విగ్రహాలు, భక్తులతో కిక్కిరిసిపోయాయి.

# వైద్యుల డిమాండ్లకు తలొగ్గిన దీదీ సర్కార్..

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి వచ్చింది. కోల్‌కతాలో నెలరోజులకు పైగా ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యుల డిమాండ్లు నెరవేర్చేందుకు దీదీ ప్రభుత్వం అంగీకరించింది . నాలుగుసార్లు రద్దు అయిన తర్వాత సోమవారం రాత్రి జూనియర్ డాక్టర్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. దాదాపు ఆరు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో వైద్యులు ఐదు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ఐదు డిమాండ్లలో మూడింటికి మమతా సర్కార్ అంగీకరించింది. ఈ మేరకు వారి డిమాండ్లు నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే వైద్యులతో సమావేశం ముగిసిన గంటల వ్యవధిలోనే కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్, వైద్యశాఖకు చెందిన ఇద్దరు అధికారులను తొలగిస్తున్నట్టు ప్రకటించింది. వారి స్థానంలో మంగళవారం కొత్త అధికారులను నియమించనున్నట్లు వెల్లడించింది. మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలోని కమిటీ కార్యాచరణ చేపట్టనుందని చర్చల ముగిసిన అనంతరం స్వయంగా మమత ప్రకటించారు. డిమాండ్లకు అంగీకారం తెలిపిన నేపథ్యంలో ఇక ఆందోళనలను విరమించాలని వైద్యులను మమతా బెనర్జీ కోరారు. ఆందోళనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోమని, వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలు వైద్యం అందక అల్లాడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని సైతం నెలకొల్పుతున్నట్లు ప్రకటించారు.

# ప్రభుత్వానికి 100 రోజులు..

మొదటి పేజి తరువాయి

దాన్ని నేడు కేబినెట్ భేటీలోనే వారికి అందజేయబోతున్నారు. నేడు ఉదయం 11 గంటలకు ఏపీ కేబినెట్ సమావేశం జరగబోతోంది. ఇందులో నూతన మద్యం పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలుపై చర్చించనున్నారు. మద్యం పాలసీపై ప్రతిపాదనలు మంత్రివర్గ ఉపసంఘం తమ ప్రతిపాదనలు సమర్పించనుంది. అలాగే ఇటీవల వరదలు, నష్టంపైనా, కేంద్రం ఇచ్చే సాయం పైనా మంత్రులు చర్చిస్తారు. అటు వివిధ మంత్రిత్వ శాఖల నివేదికలపైనా కేబినెట్‌లో చర్చ జరగనుంది.

### కేబినెట్ భేటీలోనే వరద బాధితులకు సాయంపై సీఎం చంద్రబాబు ప్రకటన చేసే అవకాశముంది.

కేబినెట్ అజెండాపై చర్చ తర్వాత వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో మంత్రుల గ్రాఫ్‌ను సీఎం చంద్రబాబు వారికి అందించనున్నారు. జనసేన మంత్రుల గ్రాఫ్‌ను పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు ఇస్తారు. అనంతరం దీనిపై చర్చించే అవకాశాలు కూడా ఉన్నాయి. మంత్రులు తమ పనితీరు మెరుగుపర్చుకునే దిశగా చంద్రబాబు వారికి దిశానిర్దేశం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు కేబినెట్ భేటీలో మంత్రులు, ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరికలు చేశారు.

# నేను ఫామ్ హౌస్ సీఎంను కాను

పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం తరపున పబ్లిక్ గార్డెన్స్ లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నామని సీఎం తెలిపారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. గత పదేళ్లగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి వెళ్తుంటే... తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మన రాష్ట్రానికి రావాల్సిన వాటి కోసం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లడానికైనా తాను సిద్ధమని అన్నారు. తాను ఫామ్ హౌస్ సీఎం కాదని... పనిచేసే సీఎంనని చెప్పారు. "తెలంగాణ భౌగోళిక స్వరూపం బిగించిన పిడికిలి మాదిరిగా ఉంటుంది. ఆ పిడికిలి పోరాటానికి సంకేతం. తెలంగాణలో అన్ని జాతులు, కులాలు, మతాలు కలిసికట్టుగా ఉంటాయన్న సందేశం అందులో ఇమిడి ఉంది. ఈ ఐక్యతను, ఈ సమైక్యతను దెబ్బతీసే విధంగా సెప్టెంబర్ 17ను కొందరు వివాదాస్పదం చేయడం మంచిది కాదు. ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు మాకు గుర్తుంటాయి. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా పాలన ఉంటుంది. తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ. వారి ఆకాంక్షలే మా కార్యాచరణ" అని సీఎం చెప్పారు.



జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా, సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చడం, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ, గద్దర్ పేరిట అవార్డులు, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును ఖరారు చేయడం వంటి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేపట్టిన అనేక చర్యలను ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు.

హైడ్రాపై ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు

చెరువులు, కుంటలలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేసే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళతామని వివరించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. హైడ్రా ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. ఈమేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్ టీఎల్), బఫర్ జోన్ లలో కట్టిన బిల్డింగ్ లు ఎంతపెద్ద వారివైనా వదిలిపెట్టబోమని రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ విషయానికి సంబంధించి హైడ్రా ఇప్పటికే పలువురు ఆక్రమణదారులకు, బడాబాబులకు నోటీసులు ఇచ్చిందని గుర్తుచేశారు. హైడ్రా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం... అధికారుల పనిలో తమ జోక్యం ఉండదని వివరించారు. కాగా, ఎఫ్ టీఎల్ పరిధిలోని నిర్మాణాలకు సంబంధించిన యజమానులకు హైడ్రా నోటీసులు పంపించింది. వెంటనే వాటిని కూల్చేయాలని హెచ్చరించింది. లేదంటే తామే రంగంలోకి దిగి వాటిని కూల్చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

### ఎన్నికలు అయ్యేంత వరకే నేను ముఖ్యమంత్రిగా ఉంటాను...
# ఆ తర్వాత మళ్లీ కేజ్రీవాలే



కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయడం తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. తాను ముఖ్యమంత్రి పదవి చేపట్టానని అభినందించవద్దని, పూలమాలలు అవసరం లేదని సూచించారు. ఎన్నికల తర్వాత మళ్లీ కేజ్రీవాల్ సీఎం అవుతారన్నారు. మద్యం పాలసీ కేసులో తప్పుడు ఆరోపణలతో కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు కేంద్రంలోని బీజేపీకి, దర్యాప్తు సంస్థలకు చెంపపెట్టు అన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ అక్రమం అని అన్నారు. కేజ్రీవాల్ స్థానంలో మరొకరు ఉంటే పదవిని వదులుకునే వారు కాదన్నారు.

అతిశీకి ఉన్న క్లీన్ ఇమేజ్.. ఆమ్ ఆద్మీ పార్టీతో రాజకీయ ప్రవేశం చేసిన అతిశీ ఇప్పటి వరకు క్లీన్ ఇమేజ్ కలిగి ఉన్నారు. ఆమెపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. అరవింద్ కేజ్రీవాల్ కు మనీశ్ సిసోడియాకు అతిశీ అత్యంత నమ్మకస్తురాలు. ఢిల్లీ ఎడ్యుకేషన్ మోడల్ నిర్మాణంలో ఆమె కీలక పాత్ర పోషించారు. వివిధ కేసులతో ఆప్ సీనియర్ నేతలు జైలు పాలవగా అప్పటి వరకు వారు చూస్తున్న శాఖలను అతిశీ చేపట్టారు. ఢిల్లీ మంత్రిగా ప్రస్తుతం అతిశీ చేతిలో కీలకమైన విద్య, వైద్యం సహా మొత్తం 14 శాఖలు ఉన్నాయి. వీటితో పాటు ఢిల్లీ ప్రభుత్వంలో ఏకైక మహిళా మంత్రి కావడంతో వచ్చే ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించగలదని కేజ్రీవాల్ భావిస్తున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆతిషీ మర్లేనా 1981 జూన్ 8న విజయ్ సింగ్ %-% త్రిప్తా వాహీ దంపతులకు జన్మించారు. ఆమె తల్లిదండ్రులిద్దరూ వృత్తిరీత్యా ప్రొఫెసర్లు. ఆమె మొదటి పేరు మార్లేనా. 2018లో నేషనల్ ఎలక్షన్స్ కు ముందు తనపేరును ఆతిషిగా మార్చుకున్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ నుంచి స్కాలర్ షిప్ పైనే మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిందామె.

2013లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన ఆమె.. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. సమీప బీజేపీ అభ్యర్థి ధరంబీర్ సింగ్ పై 11,422 ఓట్ల తేడాతో గెలిచారు. లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, హెల్త్ మినిస్టర్ సత్యేంద్ర జైన్ లు అరెస్ట్ అవ్వడం, వారి రాజీనామాల పరిణామాల తర్వాత.. ఆతిషీకి కేబినెట్ లో చోటు దక్కింది. విద్య, స్త్రీ-శిశు సంక్షేమం, సంస్కృతి, పర్యాటకం, ప్రజా పనుల శాఖ మంత్రిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

1998లో సుష్మా స్వరాజ్ 52 రోజుల పాటు తాత్కాలిక ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్ 3 పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఢిల్లీకి 1998 డిసెంబర్ 3 నుంచి 2008 నవంబర్ 30 వరకూ.. మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. విజయం సాధించి 15 సంవత్సరాల 25 రోజులపాటు మహిళా సీఎంగా పనిచేసిన రికార్డు ఆమెకే సొంతం. ఇప్పుడు ఢిల్లీకి మూడవ మహిళా సీఎంగా ఆతిషీ నియామకం కానున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలి

హైదరాబాద్: ఎంతోమంది పోరాటం వల్ల స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా తెలంగాణ ప్రజలు ఉంటారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని సూచించారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తున్నారని.. రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రైతు భరోసా, పింఛన్ ఎప్పుడిస్తారన్నారు. రూ.2500 ఎప్పుడిస్తారని ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు దెబ్బతిన్నారని విమర్శించారు. ఒక్క నెలలో 30 హత్యలు అయ్యాయని పత్రికలు రాస్తున్నాయని చెప్పారు. హోం మంత్రిని పెట్టి శాంతిభద్రతలు కాపాడాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలం ముందు పెట్టుకుందాం అనుకుంటే అక్కడ రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని విమర్శించారు. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టాడు.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికే రాజీవ్ విగ్రహం పెట్టాడన్నారు. కంప్యూటర్‌ను రాజీవ్‌గాంధీ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి అంటున్నారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నాడు.. కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుంది. మీకు తెలియదు, ఎవరైనా చెప్తే వినవంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలనే లేదు.. సెప్టెంబర్ 17ను ప్రజాపాలన అంటున్నాడని విమర్శించారు. ఇకనైనా పరిపాలనపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. ఇచ్చిన 420 హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని వదిలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు పంపిస్తామన్నారు.

# చంద్రబాబు అక్రమ కట్టడంలో నివసిస్తున్నారు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. అబద్ధాల రాజ్యానికి చక్రవర్తి చంద్రబాబు అని... ఇక ఆయన పరివారం ఎలా ఉంటుందో వేరే చెప్పక్కర్లేదని వ్యాఖ్యానించారు. సిగ్గు విడిచిన వ్యక్తికి తన తప్పు కనపడదన్నది నానుడి అని పేర్కొన్నారు. పాలకులకి ఒక న్యాయం పౌరులకు ఇంకొక న్యాయం ఉండదని... చట్టం ముందు అందరూ సమానులేనని వివరించారు. సీఎం చంద్రబాబే పర్యావరణపరంగా సున్నితమైన కృష్ణానది ఒడ్డుపై కట్టిన అక్రమ కట్టడంలో నివసిస్తున్నప్పుడు... బుడమేరు రివలెట్ పై ఇల్లు పగలగొట్టే నైతిక అధికారం ఆయనకు ఎక్కడుందని ప్రశ్నించారు. చంద్రబాబు నివసించే అక్రమ కట్టడం మొదట కూలగొట్టడం సముచితమని పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ నివాసాన్ని కూల్చాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. మరో ట్వీట్ ద్వారా విజయసాయి స్పందిస్తూ... ఏపీలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికీ ప్రతిపక్షం మాదిరే వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మానేసి పాలకపక్షంగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. భవిష్యత్తుపై ఎలాంటి విజన్ లేకుండా... గత ప్రభుత్వంపైనే పూర్తిగా ఫోకస్ చేస్తోందని మండిపడ్డారు. అధికారపక్షం మేలుకోవాలని... రాష్ట్ర ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు.

# త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..!



హైదరాబాద్: జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అనుభవం, అర్హత కలిగిన జర్నలిస్టులందరికి త్వరలో ఇళల స్థలాలు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పాలసీ తీసుకొస్తామని వివరించారు. వరంగల్ నగరానికి సంబంధించి నాళాలు ఆక్రమణలు తొలగిస్తామని మంత్రి చెప్పారు. అలాగే బీపీఎల్ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు లో అర్హులైన పేదలను గుర్తించాలన్నారు. అక్టోబర్ 2 న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభిస్తారని పొంగులేటి చెప్పారు. ఏమైనా పెండింగ్ పనులు ఉంటే.. పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. త్వరలో రేషన్ కార్డులు కూడా ఇస్తామని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ఇళ్ల పట్టాలను సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు పంపిణీ చేశారు. 1100 మంది జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పట్టాలను ఇచ్చారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన వారిలో సీఎం రేవంత్ రెడ్డి పీఆర్ఓ అయోధ్య రెడ్డి కూడా ఉన్నారు. ఈ సొసైటీలోని జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు ఏళ్ల తరబడి కోర్టులో ఉండగా రేవంత్ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్య తీరిపోయింది. అయితే అక్రిడెషన్ ఉన్నవారికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు. డిజిటల్ మీడియాలో పని చేసేవారికి అక్రిడేషన్ ఇవ్వడం లేదు. దీంతో డిజిటల్ మీడియాలో పని చేసే జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. డిజిటల్ మీడియాలో పని చేసే జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ ఉంది. చిన్న చిన్న యూట్యూబర్లు కూడా తాము జర్నలిస్టులమని చెప్పుకుంటున్నారు. అయితే ఒక సంస్థ ఉండి.. అందులో 20కి పైగా మంది పని చేస్తూ.. వారికి పీఎఫ్ ఖాతా ఉంటే.. ఆ సంస్థ జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా లేదా చూడాలి.

# తుపాను బీభత్సం.. మయన్మార్‌లో 226 మంది మృతి!



ఇంటర్నెట్ డెస్క్: భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షలమంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది. అప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాంలోనే 300 మందిని బలితీసుకుంది.

### వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై కేంద్రం ప్లాన్ ఇదే..
# తేల్చేసిన పురందేశ్వరి..!

అమరావతి: ఏపీకి కీలకమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్రం త్వరలో ప్రైవేటీకరించనుందన్న వార్తలు కార్మికులు, ఉద్యోగుల్ని కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా గత కొన్ని రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో వారు విధులు బహిష్కరించి రోడ్లపైకి వస్తున్నారు. ప్లాంట్ పనిచేసేందుకు అవసరమైన ముడి సరుకు కొరత తీవ్రమవుతుండటం, మరోవైపు ఉద్యోగులను ప్రొబేషన్ పై ఇతర సంస్థలకు పంపడం చూస్తుంటే ప్రైవేటీకరణ తప్పదనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఇవాళ రాజమండ్రిలో స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ధ్వంసం చేయాలనే ఆలోచన కేంద్రానికి లేదని ఆమె తేల్చిచెప్పారు. స్టీల్ ప్లాంట్ ని కాపాడాలనే ఆలోచనే కానీ, లాభాల్లోకి తీసుకురావాలనే ఆలోచనే కానీ, ధ్వంసం చేసే ఆలోచన కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్లాంట్ కు వచ్చి పరిశీలించి సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. అయితే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగబోదన్న హామీ మాత్రం పురందేశ్వరి ఇవ్వలేదు. కేవలం స్టీల్ ప్లాంట్ కాపాడి, లాభాల్లోకి తెస్తామని మాత్రమే చెప్పారు. గతంలో కేంద్రం కూడా పలుమార్లు ఇదే విషయం చెప్పింది. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించడం ద్వారా అది పూర్తిగా మునిగిపోకుండా చూస్తామని మాత్రమే కేంద్రం గతంలో పార్లమెంట్ లోనూ వెల్లడించింది. దీంతో స్టీల్ ప్లాంట్ వ్యవహారంపై ఏం చేయాలనే దానిపై కూటమి పార్టీల్లోనూ టెన్షన్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

### వరద బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ..
# మూడో విడత సాయం పంపిణీ



విజయవాడ, సాక్షి: మూడో దశ వరద సహాయక కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ (మంగళవారం) శ్రీకారం చుట్టింది. విజయవాడ వరద బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేస్తోంది. నిత్యావసర సరుకుల వాహనాలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 50 వేల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరపున నిత్యావసర సరుకుల పంపిణీ చేయనుంది. 33 డివిజన్లల్లో సరుకుల పంపిణీ జరగనుంది. వరద బాధితుల సహాయార్థం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోటి విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నెల జీతం విరాళంగా ప్రకటించారు. ఇప్పటికే రెండు దశల్లో వరద నీటిలో అవస్థలు పడ్డ బాధితులకు పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంచగా.. ఇప్పుడు మూడో విడతలో నిత్యావసరాలు ఇస్తున్నారు.

## సింగరేణి కొత్తగూడెం ఏరియా లైజన్ ఆఫీసర్

# కలవల చంద్రశేఖర్ కు ఘన సన్మానం

**లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షుడు దస్తగిరి కార్యదర్శి లగడపాటి రమేష్ చంద్.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఆధునిక సమాజాన్ని నిర్మించడంలో ఇంజనీర్స్ ది కీలకపాత్ర లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు షేక్ దస్తగిరి. ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వారోత్సవాల సందర్భంగా ఇంజనీర్స్ డే జరుపుకుంటున్న శుభ సందర్భంలో ఈరోజు ఇంజనీర్స్ లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో సన్మానించుకోవడం శుభ పరిణామం అని యావత్ ప్రపంచం లో భారతదేశానికి అన్నీ రంగాల్లో సుస్థిర స్థానం ఉండే విధంగా నిలపడంలో కీలకపాత్ర ఇంజనీర్లుదే అని ఈ సందర్భంగా ఇంజనీర్ల యొక్క కృషిని కొనియాడారు. కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ లో ఇంజనీరింగ్ పూర్తి చేసి సింగరేణి కార్మికుడు కుమారుడుగా ఈ సింగరేణి సంస్థలోనే సూపరిడెంట్ ఆఫ్ ఇంజనీర్ గా సింగరేణి లైజన్ ఆఫీసర్ గా లయన్స్ క్లబ్ సభ్యుడిగా విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ ఇంజనీర్ లయన్ కలవల చంద్రశేఖర్ ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం కార్యదర్శి లగడపాటి రమేష్ చంద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

# గుడివాడ రామ్ లక్ష్మణ్ కి ఘన నివాళులు అర్పించిన

**మాదిగ సంక్షేమ సంఘం, రామవరం అంబేద్కర్ భవన్.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామా టాకీస్ ఏరియా కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గుడివాడ రామ్ లక్ష్మణ్ 75 ఈరోజు మృతి చెందారు. ఆయన 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో భాగంగా కొత్తగూడెంలో విద్యార్థి దశలోనే పాల్గొని, కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడిగా పనిచేసే ఎంతోమంది కి సేవ చేశారు. దళిత నాయకుడిగా దళిత ఉద్యమంలో పాల్గొని అనేక హక్కులు సాధించి దళిత బాంధవుడిగా ఆయనకి మంచి పేరు ఉన్నది. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ వెంకన్న, జిల్లా కార్యదర్శి సామర్ల సమ్మయ్య,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బరిగెల భూపేష్, జిల్లా నాయకులు ఆవునూరి సంజీవరావు, కొత్తూరు మదనయ్య, బొంకూరి పోశం మాటేటి అంజయ్య, ఇల్లందుల పోచయ్య, నమిల్ల మధు, ఐ ఎన్ టి యు సి నాయకులు గౌస్ భాయ్,రాధాకృష్ణ, బచ్చు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మేట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి రణవేణి సుజాత సత్యనారాయణ పతాక ఆవిష్కరణ చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి మోహన్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రావు మేనేజర్ వెంకటలక్ష్మి ఆర్ఐ అక్షయ్ ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ ముజీబ్ కౌన్సిలర్ మొరపు గంగాధర్ నాయకులు బర్ల రమేష్ ఊజగిరి శ్రీనివాస్ రాజారామ్ హనుమాన్లు మున్సిపల్ స్టాఫ్ పాల్గొన్నారు

## బయ్యారం మండలంలో ప్రజాపాలన సందర్బంగా

# జాతీయ జెండా ఆవిష్కరణ



బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సెప్టెంబర్ 17 ను పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవాన్ని మండలంలో



ప్రభుత్వ కార్యాలయలలో జాతీయ జెండా ను సంబంధిత అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్



బి. విజయ.. ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఎఫ్ ఆర్ ఓ సువచ్చాల రెడ్డి, పోలీస్ స్టేషన్ లో సీఐ రవి కుమార్, ఎంపిడిఓ కార్యాలయంలో ఇంచార్జ్ఎంపిడిఓదైవాదినం,సొసైటీ కార్యాలయం లో పిఏసిఎస్చైర్మన్ మూలమధుకర్రెడ్డి జాతీయ ౹జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పించారు.వారి త్యాగాలను స్మరించుకుని అనంతరం జాతీయ గీతం,తెలంగాణ గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వేల్పుల శ్రీనివాస్,తిరుమల ప్రభాకర్ రెడ్డి,చెరుకుపల్లి నాగమణి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 30న చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 30న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం టేకులపల్లి లో జరిగిన మండల స్థాయి గ్రామపంచాయతీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందుగ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే పర్మినెంట్ చేసి వేతనాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలపై సెప్టెంబర్ 19న ఖమ్మంలో రెండు ఐఎఫ్టియుల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాంతీయ సదస్సును కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సరికొండ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, జిల్లా నాయకులు తొగర సామెల్, అన్నాజీ,ఎర్రయ్య, మహేష్,ప్రసాద్, లింగా,తార్య,నాను, చారి తదితరులు పాల్గొన్నారు.

# మట్టిమనుషులను పోరాట యోధులుగా మార్చింది 'ఎర్రజెండా'నే

**నిజాంకు వణుకు పుట్టించిన చరిత్ర తెలంగాణ ప్రజలది సాయుధ పోరాట చరిత్ర దేశానికి దిక్సూచి.**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : మట్టిమనుషులను పోరాట యోధులుగా మార్చింది కమ్యూనిస్టుల ఎర్రజెండానేనని, కమ్యూనిస్టులతో మమేకమై నాటి మట్టిమనుషులు సాగించిన వీరోచిన పోరాట ఫలితమే నేటి ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్రమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. 76వ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో జాతీయ జెండాను ఎగురవేసి సాయుధ పోరాట అమరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో సాబీర్ పాషా మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటం నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తోందని, దున్నేవాడికే భూమి నినాదం దేశవ్యాప్తం చేసిందని కొనియాడారు. మహత్తరమైన, త్యాగపూరితమైన సాయుధ పోరాటాన్ని మతపోరాటంగా చిత్రీకరిస్తూ నేటి ఆర్ఎస్ఎస్ వారసులుగా ఉన్న బీజేపీ లబ్దిపొందే కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణ విలీనంకోసం జరిగిన నాటి సాయుధ పోరాటం నుంచి స్వరాష్ట్రంకోసం జరిగిన తొలిదశ, మలిదశ వీరోచిత పోరాటంలో విజయాలు సాధించిన తెలంగాణ గడ్డపై మతోన్మాదుల అటలు సాగవన్నారు. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్చను పొందడంకోసం ఆనాటి యావత్ సమాజం కమ్యూనిస్టు యోధులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మక్కం మొహియుద్దీన్, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ వంటి వారి నేతృత్వంలో ఉద్యమించిన తీరు ప్రతిఒక్కరికి స్ఫూర్తి అని అన్నారు. తెలంగాణ విముక్తి పోరాటం ప్రపంచ ప్రజా ఉద్యమాలకు ఆదర్శమన్నారు. రజాకారుల రాచరిక పాలన నుంచి తెలంగాణ ప్రజలను రక్షించేందుకు వందల ఏండ్ల చరిత్ర ఉన్న నిజాం రాజును గద్దె దింపిందని, నిజాం స్వాధీనంలో ఉన్న తెలంగాణా భూ భాగాన్ని భారతదేశంలో అంతర్భాగం చేసింది కమ్యూనిస్టుల ఉద్యమేనన్నారు. ఆ మహత్తర పోరాటంలో 4500మంది యువ కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారని, వారి ప్రాణత్యాగ ఫలితంగానే పది వేల గ్రామాలను విముక్తి లభించిందని అన్నారు. పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేశారని, ఇంత పెద్ద మొత్తంలో భూమిని పంచిన చరిత్ర ప్రపంచంలో ఎక్కడా లేదని, నాడు రైతాంగి పోరాటంలో పంచిన భూముల్లో నేటి పాలకులు మూడో వంతు కూడా పంచలేదని విమర్శించారు. నాటి సాయుధపోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజాపోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కె. రాజ్కుమార్, కె. సారయ్య, జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, వట్టికొండ మల్లికార్జునావు, భూక్య శ్రీనివాస్, రత్నకుమారి, ధనలక్ష్మి, ధర్మరాజు, యూసుఫ్, మాచర్ల శ్రీనివాస్, మాతంగి టింగయ్య, లక్ష్మినారాయణ, షాహీన్, విజయలక్ష్మి, దార లక్ష్మి,నేరెళ్ళ రమేష్, మిర్యాల రాము, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించిన వనపర్తి పోలీసులు!!

## అందరికీ ఆదర్శం వనపర్తి పోలీస్!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అనేక పోలీస్ స్టేషన్ ల లో పోలీసులు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు దగ్గరవుతున్నారు, ముఖ్యంగా వనపర్తి పోలీస్ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పడానికి ఇదే నిదర్శనం ట్రాఫిక్ రూల్స్, పాటించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు, పట్టణ ఎస్ఐ జయన్న నేతృత్వంలో పనిచేస్తున్న కిందిస్థాయి పోలీసులు తమ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో జిల్లా లోని పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారు, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్, నెంబర్ ప్లేట్ వంటి వాహనాలను పోలీసులు ఎప్పటికప్పుడు పట్టుకొని కటకటాల పాలు చేయడానికి వెనుకడుగు వేయడం లేదు,







ఎందుకు నిదర్శనం వనపర్తి పోలీసులు హెల్మెట్ ధరిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు, వనపర్తి ట్రాఫిక్ పోలీసులతో పాటు హోంగార్డులు, సకాలంలో జీతాలు రాకపోయినా కూడా పోలీస్ శాఖకు పేరు తెచ్చి పెట్టడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు, 24 గంటలు రోడ్ల పైన చెత్త , దుమ్ము ధూళి, ఎండ వర్షం, చలి అంటే తెలవకుండా పనిచేయడం లో హోంగార్డుల కృషి అభినందనీయం, అంతేకాక సివిల్ పోలీసులు, తమ వృత్తి ధర్మాన్ని ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా తమ బాధ్యతలను కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో తెలంగాణ పోలీస్ శాఖ నెంబర్ వన్ స్థానంలో నిలబడింది, రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా వనపర్తి పోలీసులు ట్రాఫిక్ నియంత్రణతో పాటు ముఖ్యంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు వాహన దారులకు అవగాహన కల్పించడంలో సఫలీకృతమయ్యారు, వనపర్తి పోలీసులతోపాటు తెలంగాణ పోలీస్ ఫ్రెండ్లీ పోలీస్ విశిష్ట సేవలు అందిస్తుందని నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్నగర్, జిల్లాలో పనిచేస్తున్న పోలీసులను ఆయా జిల్లాల ప్రజలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు, అభినందిస్తున్నారు, శాంతిభద్రతతో పాటు ఇటీవల సైబర్ నేరాలు, మాటక ద్రవ్యాలు నియంత్రణ కోసం పోలీస్ శాఖ ఎంతో కృషి చేస్తూ అరికట్టడం జరుగుతుంది,

# పెరిగిన వంట నూనెల ధరలు!!

## ఆందోళనలో మహిళా లోకం!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): దేశవ్యాప్తంగా ప్రతినిత్యం ప్రతి మానవుడు ముఖ్యంగా గృహిణి మహిళలు ఉపయోగించే వంట నూనె ధరలు కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో పెంచడం పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు, ఇటీవల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటిన నేపథ్యంలో ఇప్పటికీ పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, ధరలతో పాటు టమాటా ధరలు భారీ మొత్తంలో పెరగడం వల్ల సామాన్య ప్రజలు తినడానికి తిండి లేక తిప్పలు పడుతున్న సందర్భంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు కనీసం బుక్కెడు బువ్వ పెట్టని పరిస్థితి ఈ దేశాల్లో నెలకొన్నది ధరల మీద ధరలెక్కే నాగులో నాగన్న అనే పాట ఇప్పటికి ప్రజలు





మరచిపోలేకపోతున్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధమైన పదవులు అనుభవిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపవాస్యం చేస్తూ స్వార్థపరంగా ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి, ఎందుకు నిదర్శనమే కేంద్ర ప్రభుత్వం ప్రపంచంలో అతిపెద్ద ఎడిబుల్ ఆయిల్ దిగుమతి పై 20 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతుంది, శుద్ధి చేసిన తినదగిన నూనెల పై దిగుమతి పన్ను పెంచి ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టింది, రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతులపై 13.75% ఉన్న దిగుమతి సుంకం ఏకంగా 35. 76% పెంచింది, దీనివల్ల లీటర్ ఆయిల్ పైన 20 నుంచి 30 రూపాయలు ధర పెరిగింది, మార్కెట్లోకి వచ్చేపాటికి వ్యాపారస్తులు ఒక లీటర్ ఆయిల్ పైన మరో అదనంగా 40 రూపాయలు వసూలు చేస్తున్నారు, ఈ విధంగా చూస్తే ఒక లీటర్ ధర గతంలో 115 రూపాయలు ఉన్న ఆయిల్ 170 రూపాయలకు చేరింది, ముఖ్యంగా హిందూ సాంప్రదాయ ప్రకారం హిందువులు మహిళలు, పూజారులు, దేవాలయాలలో దేవునికి దీపం పెట్టడానికి కూడా ఉపయోగించే ఆయిల్ ధర కూడా పెరిగింది, ఇంత దుస్థితి ఏ రోజు కూడా రాలేదని ప్రజలు అంటున్నారు, మూడి నూనెల దిగుమతి సుఖం పెంచడం పట్ల నూనె ధరలు పెరిగినట్లు వ్యాపారస్తులు అంటున్నారు, ఇది అర్థం గా భావించి కిరాణం షాపుల్లో సూపర్ మార్కెట్లో, వనపర్తిలో విచ్చలవిడిగా వ్యాపారస్తులు దోపిడీ చేస్తున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు, వనపర్తి లోని కిరాణా షాపుల్లో సంబంధిత తూనికల కొలతల శాఖ అధికారులు, ఇన్కమ్ టాక్స్ అధికారులు, సేల్ టాక్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ వ్యాపారస్తుల దగ్గర అక్రమంగా మామూలు తీసుకొని చూసి చూడనట్లు వదిలిపెడుతున్నారని ప్రజలు అంటున్నారు, ఎక్కడ చూసినా కిరాణా షాపుల్లో ప్రతి వస్తు ధర అంతులేకుండా అంత చిక్కకుండా పెంచి వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వల్ల వ్యాపారస్తులకు పండుగ అయిందని ఆరోపణలు కూడా వస్తున్నాయి, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే కిరణం షాపుల పైన సూపర్ మార్కెట్ల పైన, దాడులు నిర్వహించి వ్యాపారస్తులు చేస్తున్న మోసాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు, కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరకు అదనంగా వ్యాపారస్తులు అమ్ముతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి, ఈ విషయం పైన జిల్లా కలెక్టర్ తక్షణమే చర్య తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు, ఒక ఒక కూరగాయల ధరలు మరోపక్క వంట నూనె ధరలు కిరణం వస్తువులు పెరగడానికి ప్రధాన కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అయినప్పటికీ లమరోపక్క వ్యాపారస్తుల పాత్ర కీలకంగా ఉందని చెప్పవచ్చు,




# ఘనంగా పీఎం నరేంద్ర మోడీ జన్మదిన వేడుక



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలంలోని బిల్లుడు తండా గ్రామపంచాయతీలో మండల బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు బాదావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాదావత్ సురేష్ మాట్లాడుతూ పేదలకు మోడీ సర్కార్ అందిస్తున్న పథకాలను వివరించి దేశ ప్రధాని కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామాల అభివృద్ధి మరింతగా జరగాలంటే నరేంద్ర మోడీ లాంటి మేధావులకే సాధ్యం అవుతుందని,దేశ ప్రజలు మోడి కి మరోక సారి అవకాశం ఇచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు, మోడి వంటి వ్యక్తి మాత్రమే దేశంలోని పేద ప్రజలను అభివృద్ధి చేయగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు లక్పతి నాయక్ గ్రామ యువకులు తారాచంద్,చరణ్, కిషోర్, నగేష్, లక్ష్మణ్,రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు పౌర్ణమి రోజు శ్రీ భగలాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్):** నేడు 18న పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అదే రోజు నా జన్మదినం సందర్భంగా మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నెలకొల్పిన అత్యంత శక్తిపీఠమైన శ్రీ భగలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడమే కాకుండా పట్టువస్త్రాలు సమర్పిస్తామని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, సోమవారం నాడు విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. భగలాముఖి అమ్మ వారిని దర్శించుకున్న భక్తులందరికీ అన్న ప్రసాధ వితరణ ఉంటుందని చెప్పారు . అదే రోజు చెంది గ్రామంలోని చాముండేశ్వరి దేవాలయం తో పాటు గూడూరు గ్రామంలో ప్రతిష్టించిన వినాయకుని మండపం వద్ద అన్నదాన వితరణ కూడా ఉంటుందని అన్నారు. శివ్వంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో,మండల పరిధిలోని బేతని సంరక్షణ అనాధ ఆశ్రమంలో చిన్నారులకు పండ్ల పంపిణీ ఉంటుందన్నారు. షిరిడీలో కావుకూర్ సాయిబాబా ఆలయ దేవాలయంలో అన్న ప్రసాద వితరణ ఉంటుందని శివకుమార్ గౌడ్ చెప్పారు. శ్రీ భగలాముఖి శక్తిపీఠంలో బుధవారం నాడు అమ్మవారి మహా పూజ, మహా మంత్ర హవనము, పూజా కార్యక్రమంలో తాను కుటుంబ సమేతంగా పాల్గొంటామని శివకుమార్ గౌడ్, పేర్కొన్నారు. అక్కడ కూడా తమ తల్లిదండ్రులు అంజమ్మ లింగయ్య గౌడ్, జ్ఞాపకార్థం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉ ంటుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని శివకుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## సార్వత్రిక విద్య ఎంతో సులభమైనది




నర్సంపేట**(గౌతమ్ న్యూస్):** సార్వత్రిక విద్య ఎంతో సులభమైనదని, వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్ మురాల శంకర్ రావు అన్నారు, ఓపెన్ స్కూల్ ప్రాధాన్యత పై అవగాహనలో భాగంగా మంగళవారం రోజున నర్సంపేట లోని ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్ , ఇంటర్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్,బ్రోచర్ ను కళాశాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపాల్ కొయ్యడా సనత్ కుమార్ లతో కలిసి ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్ రావు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కో ఆర్డినేటర్ గారు మాట్లాడుతూ సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు,వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఆదివారాలు, సెలవు దినాలలో ముఖా ముఖి తరగతులకు హాజరై కోర్సు పూర్తి చేయవచ్చని అన్నారు. సనత్ కుమార్ మాట్లాడుతూ ఓపెన్ టెన్త్,ఇంటర్లలో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించి వారి సూచనల మేరకు ఆన్లైన్లో సంబంధిత రుసుము చెల్లించి ప్రవేశాలు పొందాలన్నారు . ప్రవేశాలకు అపరాధ రుసుము ఎస్ఎస్సి కి రూ.100/-, ఇంటర్ కి రూ.200/- లతో చివరి తేదీ అక్టోబర్ 3వరకు ఉందని అడ్మిషన్ల కొరకు అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మంచిక లక్ష్మినారాయణ 7386180621,ప్రవీణ్ గారిని 9032320631,9849506926నంబర్లలో సంప్రదించాలని అన్నారు.,ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శిరీష అధ్యాపకాబృందం వైస్ ప్రిన్సిపాల్, సూరయ్య, సంతోష్, ఉమాదేవి, సునీత, మంచిక లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ మహా గణపతి కీ టా..టా.. బాయ్.. బాయ్



హైదరాబాద్**(గౌతమ్ న్యూస్):** ఖైరతాబాద్ మహా గణపతి నిమర్జనం ప్రక్రియ మంగళవారం ఉదయం ప్రారంభమై మధ్యాహ్నానికి హుస్సేన్ సాగర్ తీరానికి చేరుకుంది. భారీ గణనాథుని నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 1.39 గంటలకు ఖైరతాబాద్ వినాయకుడు నిమజ్జనం పూర్తయింది. 4వ క్రేన్ దగ్గర 70 అడుగుల ఖైరతాబాద్ బొజ్జ గణపయ్య నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. దీంతో ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన క్రతువు వైభవంగా సాగింది. 70 అడుగుల భారీ మహా గణనాథుని విగ్రహాన్ని వేలాది మంది భక్తుల మధ్య డప్పుల మోత, డీజేల కోలాహలమైన సంగీతం మధ్య ట్యాంక్‌బండ్‌కు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర మార్గంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బండ్లగూడ గణపతి లడ్డు ఆల్ టైం రికార్డు ధర



హైదరాబాద్ **(గౌతమ్ న్యూస్):** హైదరాబాద్ లో రికార్డు స్థాయిలో గణేశ్ లడ్డూ వేలం పాటు జరిగింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీర్తి రిచ్మండ్ విల్లాస్ లో నిర్వహించిన వేలం పాటలో లడ్డూ ఏకం గా రూ. 1.87కోట్లు పలికింది. ఇది తెలుగు రాష్ట్రాల్లో కనీవినీ ఎరుగని రీతిలో రికార్డు క్రియేట్ చేసింది. వినాయక చవితి కంటే గణేశుడి నిమజ్జనంపై అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే లడ్డూల వేలంపాట జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎప్పుడూ కూడా బాలాపూర్ లడ్డూ ఎక్కువ ధర పలుకుతుంది. కానీ ఇప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో హైదరా బాద్ లో రికార్డు స్థాయిలో గణేశుడి లడ్డూ వేలంపాట జరిగింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీర్తి రిచ్మండ్ విల్లాస్ లో నిర్వ హించిన వేలంపాటలో లడ్డూ ఏకంగా రూ. 1.87 కోట్లు పలికింది. దీన్ని దక్కించుకున్న భక్తుడి వివరాలు ఇంకా తెలియ రాలేదు. కాగా గతేడాది ఇక్కడి లడ్డూ రూ.1.20 కోట్లు పలికిందని సమాచారం. ఈ సారి ఆ ధరను బ్రేక్ చేసేలా వేలంపాట జరిగింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్ లోని మాదాపూర్ మై హెూం భూజాలో గణేశ్ లడ్డూ వేలంపాటలో ఖమ్మం జిల్లాలకు చెందిన కొండపల్లి గణేష్ రూ. 29లక్షలకు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

## త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..!

**(గౌతమ్ న్యూస్):** జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అనుభవం, అర్హత కలిగిన జర్నలిస్టులందరికి త్వరలో ఇళల స్థలాలు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మీడియా ప్రతినిధుల తో మాట్లాడిన ఆయన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పాలసీ తీసుకొస్తామని వివరించారు. వరంగల్ నగరానికి సంబంధించి,నాళాలు ఆక్రమణలు తొలగిస్తామని మంత్రి చెప్పారు.



అలాగే బీపీఎల్ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు లో అర్హులైన పేదలను గుర్తించాలన్నారు. అక్టోబర్ 2 న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభిస్తారని పొంగులేటి చెప్పారు. ఏమైనా పెండింగ్ పనులు ఉంటే.. పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. త్వరలో రేషన్ కార్డులు కూడా ఇస్తామని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ఇళ్ల పట్టాలను సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు పంపిణీ చేశారు. 1100 మంది జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పట్టాలను ఇచ్చారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన వారిలో సీఎం రేవంత్ రెడ్డి పీఆర్ఓ అయోధ్య రెడ్డి కూడా ఉన్నారు. ఈ సొసైటీలోని జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు ఏళ్ల తరబడి కోర్టులో ఉండగా రేవంత్ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్య తీరిపోయింది. అయితే అక్రిడెషన్ ఉన్నవారికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు. డిజిటల్ మీడియాలో పని చేసేవారికి అక్రిడేషన్ ఇవ్వడం లేదు. దీంతో డిజిటల్ మీడియాలో పని చేసే జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. డిజిటల్ మీడియాలో పని చేసే జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ ఉంది. చిన్న చిన్న యూట్యూబర్లు కూడా తాము జర్నలిస్టులమని చెప్పుకుంటున్నారు. అయితే ఒక సంస్థ ఉండి.. అందులో 20కి పైగా మంది పని చేస్తూ.. వారికి పీఎఫ్ ఖాతా ఉంటే.. ఆ సంస్థ జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా లేదా చూడాలి.

# అసైన్డ్ భూములకు పంట రుణం నిరాకరిస్తున్న బ్యాంకులు!!

### రైతు ప్రభుత్వం లో ఇదెక్కటి న్యాయం!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణమాఫీలో గందరగోళం మరొక్క మాఫీ అయినా రైతులకు బ్యాంక్ అధికారులు మొండి చేయి చూపిస్తున్నారు, ఇందుకు నిదర్శనం తెలంగాణలోని 33 జిల్లాల్లో దాదాపు 24 లక్ష ఎకరాల భూములు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల చేతుల్లో ఉన్నాయి, ఎస్సీ ,ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేద రైతులు అసైన్డ్ భూములు స్వాధీనంలో ఉన్నప్పటికీ తరతరాలుగా అనుభవిస్తున్నప్పటికీ బ్యాంక్ అధికారులు గతంలో రుణాలు మంజూరు చేశారు, కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రూపాయల పంట రుణమాఫీ లో లబ్ధి పొందిన రైతులు తిరిగి పంట రుణం కోసం బ్యాంకుకు వెళ్లి



రెన్యువల్ చేయడానికి పోతే బ్యాంక్ అధికారులు అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇవ్వడం కుదరదని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, రాష్ట్రవ్యాప్తంగా గత టీఆర్ఎస్ ప్రభుత్వం అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో పెట్టిందని అందువల్లనే పంట రుణం ఇవ్వలేకపోతున్నామని బ్యాంక్ అధికారులు తేల్చి చెపుతున్నారు, ధరణి పోర్టల్ కు బ్యాంక్ అధికారులకు అనుసంధానంగా ఆన్లైన్ లో రైతుల భూముల వివరాలు ఉన్నప్పటికీ అసైన్డ్ భూముల జాబితా మాత్రం కనిపించడం లేదు, అందువల్లనే రుణాలు ఇవ్వలేమని బ్యాంక్ అధికారులు అంటున్నారు, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల ఎకరాల భూములు కలిగిన దాదాపు 40 లక్షల మంది రైతులు పంట రుణాలకు నోచుకోలేక పోతున్నారు, రెవెన్యూ అధికారులు వ్యవసాయ అధికారులు కూడా ఏం చేయలేకపోతున్నారు, ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని చందంగా ఉంది, ఈ విషయం పైన ప్రతిపక్ష పార్టీలు , వామపక్ష పార్టీలు కూడా ఏమి చేయలేకపోతున్నారు, రైతుల పక్షాన పోరాటాలు చేయవలసిన ప్రతిపక్షం పార్టీలు మౌనంగా ఉండడం వల్లనే ఈ తతంగం జరుగుతుందని రైతులంటున్నారు, పంట రుణమాఫీలో కూడా ఇప్పటికీ రుణం మంజూరు కాక రైతులు లబోదిపోమంటున్నారు, రెండు లక్షల రూపాయలకు పైన అప్పు కలిగిన రైతులు ముందుగా బ్యాంకుకు ఆ డబ్బు చెల్లించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం సిగ్గుచేటని రైతులు అంటున్నారు, ఇవ్వవలసిన రెండు లక్షల రూపాయలు పంటలను ప్రభుత్వం బ్యాంకుకు చెల్లించాలని ఆ తర్వాత రైతులు మిగతా డబ్బు చెల్లించి పంట రుణాన్ని రెన్యువల్ చేసుకుంటారని రాష్ట్రంలోని రైతు



సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు, ప్రభుత్వం రుణమాఫీ చేయలేక ఇలాంటి తప్పుడు కండిషన్లు, షరతులు, డిమాండ్లు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రతి గ్రామంలో రైతులకు చర్చించుకుంటున్నారు, ముందుగా ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం 2 లక్షల రూపాయల పంట రుణమాఫీ చేస్తామని చెప్పి ఆ తర్వాత మాట మార్చిందని దీనికి ప్రభుత్వం అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు, గత ప్రభుత్వం కూడా ఇలాంటి తప్పుడు ప్రకటనలు చెప్పి అధికారం కోల్పోయిన విషయం కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది, ఏ ప్రభుత్వమైనా మాయ మాటలతో అధికారంలోకి రావడం మా తర్వాత ఇచ్చిన మాట గాలికి వదిలిపెట్టడం రాష్ట్రంలో కొన్ని లక్షల కోట్ల రూపాయలు అప్పు తీసుకొని ప్రభుత్వాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వాలు అట్టి అప్పును ఎవరు చెల్లించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, 2 లక్షల పంట రుణ మాఫీ తో పాటు రైతు భరోసా నిధులు వానాకాలం, యాసంగి కాలానికి ఇప్పటివరకు నిధులు గతి లేవు అలాంటి ప్రభుత్వం రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో ప్రజల తిరుగుబాటుకు కుప్పకూలిపోవడం ఖాయమని ప్రజలు అంటున్నారు, వెంటనే 2 లక్షల రూపాయలు ప్రతి ఒక్కరికి చెల్లించాలని మిగతా డబ్బులు బ్యాంకుకు చెల్లించాలని డిమాండ్ ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష పార్టీలు రైతుల పక్షాన పోరాటం చేయాలని రైతులు కోరుతున్నారు,

## రావిరాల గ్రామ ప్రజలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన...కిషన్ నాయక్

మహబూబాబాద్ **(గౌతమ్ న్యూస్):** ఇటీవల కాలంలో భారీగా కురిసిన వానలకు వాగులు వంకలు, చెరువులు తెగి ఉప్పొంగి ప్రవహించటంతో నెల్లికుదురు మండలం, రావిరాల గ్రామపంచాయతీకి చెందిన దళిత కాలని పూర్తిగా మునిగటముతో ఈ గ్రామాన్ని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్, న్యాయవాది వాసం ఆనంద్ కుమార్, కొప్పుల రమేష్, పైండ్ల యాకయ్య పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు సందర్శించి కాలని ప్రజలను పరామర్శించడము జరిగింది. ఈ సందర్భముగా గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ ఈ కాలనిలో దాదాపుగా 80 కుటుంబాలు కలిగి 250 మంది దాకా వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఈ వరదల కారణంగా ఈ కాలని ముంపుకు గురికావడంతో గ్రామంలోని కనీస అవసరాలు కూడా తీర్చుకోలేనటువంటి పరిస్థితికి నెలకొంది. వారి నిత్యవసర వస్తువులైనటువంటి ఉప్పులు, పప్పులు, బియ్యం, ఫ్యాన్లు, మంచాలు,





కుర్చీలు దాచుకున్న ధాన్యం అన్ని తడవటంతో కనీసం తినడానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డ కూడా లేనటువంటి పరిస్థితికి ఈ కాలని ప్రజలు నెట్టివేయబడ్డారు. ఈ గ్రామాన్ని కొద్ది రోజుల కిందట రాష్ట్ర మంత్రివర్యులు, కలెక్టర్, అధికారులు సందర్శించి ప్రతి కుటుంబానికి తక్షణసాహంగా 10,000 సమకూరుస్తామని చెప్పిన నేటికీ ఒక్క రూపాయి కూడా వారిని దరిచేరలేదు. ఇప్పటికీ ఆహారం కోరకు దాతల కోసం ఎదురుచూస్తున్నారు. వారి పంటలు ఆరుగాలం పండించి దాచుకున్న ధాన్యం తడిసి నీటిలో ముద్దయింది. కాలనిలో ఉండే జంతు సంపద కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవులు, బర్రెలు నీటిలో కొట్టకపోయి చనిపోవడం జరిగింది. ఇల్లులు కొన్ని శిథిలావస్థకు చేరుకున్నవన్ని కూలిపోతున్నాయి. ఎవరికైతే ఇల్లు జాగా లేనటువంటి వారు ఉన్నారో వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే ఈ గ్రామ ప్రజలకు కనీసం నిత్యవసర అవసరాలు తీరేలా వారికి నిత్యవసరాలతో పాటు ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున సహాయము అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో న్యాయవాది వాసం ఆనంద్ కుమార్, కొప్పుల రమేష్, పైండ్ల యాకయ్య పి వై ఎల్ జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు విలీనమా విమోచనమా విద్రోహ దినమా

**తెలంగాణ ఉద్యమకారుడు,**
**రాజకీయ విశ్లేషకుడు,**
**గౌడ జన హక్కుల పోరాట సమితి.**
**మోకు దెబ్బ మహబూబాబాద్**
**జిల్లా అధ్యక్షులు**
**బీసీ రాజ్యాధికారా సమితి ఉమ్మడి**
**వరంగల్ జిల్లా కన్వీనర్ .**
**ముంజాల రాజేందర్ గౌడ్**



**(గౌతమ్ న్యూస్):** భారతదేశమంతా కూడా బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతం నిజాం రాజు చేతిలో బందీగా ఉంది. భారతదేశమంతా స్వతంత్ర పోరాటం చేస్తుంటే తెలంగాణ ప్రాంతంలో ప్రజలు తెలంగాణ సాయుధ పోరాటం ఎంచుకొని నిజాం ప్రభువుకు మరియు రజాకార్లకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రతిఘటనలు చేస్తూ పోరాటం ముందుకు సాగించారు. ఆగస్టు 15 1947 లో భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం ప్రభువు చేతిలో ఇంకా బందీగా ఉంది, యావత్ భారతదేశ ప్రజలు స్వేచ్ఛ స్వతంత్రాన్ని అనుభవిస్తుంటే తెలంగాణ ప్రాంతంలోని ప్రజలు నిజాం నిరంకుషానికి బలైపోతూనే ఉన్నారు, ఒకవైపు సాయుధ పోరాటం వల్ల నిజాం రాజుకు ముచ్చమటలు పటిస్తున్న తెలంగాణ ప్రజలు , రజాకార్లను, దేశ్ ముఖులను ఊర్ల నుండి తరిమికొడుతుంటే, ఇది ఒక విప్లవాత్మకమైన మార్పుగా వెళుతుందని దక్షిణాది రాష్ట్రాల్లో సాయుధ పోరాట ప్రభావం చూపెడుతుందని భావించిన భారత ప్రభుత్వం ఆనాడు ఆపరేషన్ పోలో చేపట్టి మిలటరీతో తెలంగాణ ప్రాంతమైనటువంటి హైదరాబాదు స్టేట్ ని భారత దేశంలో కలుపుకునేందుకు నిజాం రాజు పై దండయాత్ర చేయడం జరిగింది అలా తీసుకున్న చర్యనే ఆపరేషన్ పోలోగా ఆనాటి భారత ప్రభుత్వం చెబుతుంది. భారత దేశ మిల్ట్రీ హైదరాబాద్ స్టేట్ లో అడుగుపెట్టి నిజాం రాజుకు వ్యతిరేకంగా రజాకారులతో ప్రత్యక్ష యుద్ధం లో దిగారు ఇలా కొన్ని రోజులు సాగినటువంటి ఆపరేషన్ పోలో కి తలొగ్గిన నిజాం ప్రభువు భారత దేశ హెూం శాఖ మంత్రి అయినటువంటి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారికి లొంగిపోయి హైదరాబాద్ స్టేట్ ని భారత దేశంలో విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. కానీ, ఆనాటి భారత దేశ ప్రభుత్వం తెలంగాణలో జరుగుతున్నటువంటి సాయుధ పోరాటం, ఇక్కడ ప్రజల చైతన్యాన్ని గమనించి ఈ చైతన్యమంతా కూడా దక్షిణాది రాష్ట్రాల్లో కచ్చితంగా వ్యాపిస్తుందని దాని ప్రభావం యావత్ భారతదేశంపై పడుతుందని దానివల్ల భారతదేశం అంతా కూడా కమ్యూనిస్టు దేశంగా మారే అవకాశం ఉందని గ్రహించి ఆపరేషన్ పోలోను చేపట్టడం జరిగింది. ఈ ఆపరేషన్ పోలో ముసుగులో రజాకారులను, సామాన్యులను, ఒక వర్గ ప్రజలను మరియు సాయుధ పోరాటం వీరులను అంతం చేయడం జరిగింది. మరోవైపు చరిత్రకారుల పుస్తకాల్లో తెలంగాణ ప్రజల మానప్రాణాలను ఆపరేషన్ పోలో ముసుగులో దోచేశారని, కుప్పల కొద్దీ శవాలు విలిన తర్వాత బయటపడ్డాయని అనేకమంది మహిళలు మానాలు కోల్పోయారని చరిత్రకారుల పుస్తకాల్లో లిఖించబడ్డాయ, అందుకనే కమ్యూనిస్టులు ఈ రోజును విద్రోహ దినంగా ప్రకటించాయి, మరోవైపు భారతదేశం దీన్ని విలీనం ప్రక్రియగా ప్రకటించి ఇక్కడి ప్రజలను నిజాం నిరంకుశ పాల నుండి విమోచనం చేశామని ప్రకటించడం జరిగింది. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సెప్టెంబర్ 17 యొక్క ఆనవాళ్లు లేకుండా చేయడం జరిగింది. ఈ రోజును ఒక ప్రత్యేక దినంగా తెలంగాణ అస్తిత్వానికి గుర్తుగా ఆపరేషన్ పోలో అమరవీరులకు, సాయుధ పోరాట అమరవీరులకు ఇక్కడ ప్రజల త్యాగాలకు గుర్తుగా ఈ రోజును జరుపుకాకుండా, చరిత్రను చెప్పుకునే అవకాశం లేకుండా చేసింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్ర పెత్తందారులు , ఆనాటి ముఖ్యమంత్రులు ఇలా చరిత్ర కనుమరుగు చేసే ప్రయత్నం జరుగుతుంటే ఇక్కడి ప్రజలు చైతన్యవంతమై 1969లో విద్యార్థి ఉద్యమం చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని మా హక్కులను మేము కాపాడుకుంటామని పోరాటం చేశారు ఆనాడు వందలాదిమంది విద్యార్థుల ప్రాణాలను బలికున్నారు ఆంధ్ర పెత్తందార , ముఖ్యమంత్రులు. ఆ తర్వాత తెలంగాణ వాదం కొన్ని రోజులు మరుగునపడిన 2001 తర్వాత అది రాజకీయ ఉనికిని పుచ్చుకొని మరో ఉద్యమంగా మారింది అలా సాగుతున్న ప్రయాణంలో 2009లో ఉద్యమం ఉధృతంగా మారి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు జరిగింది వేలాదిమంది ప్రజలు ఆత్మ బలిదానాలు చేసుకున్నారు ప్రపంచ చరిత్రలో త్యాగాలు చేసిన వీరులను చూశారు కానీ ఆత్మ బలిదానాలు చేసుకున్నటువంటి అమరవీరులను తెలంగాణ ప్రాంతంలోని చూశాను, ఎందుకంటే ఒకవైపు భారత దేశ ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల పైన చేస్తున్నటువంటి అణచివేతను తీవ్రంగా ప్రతిఘటిస్తూన్న, నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రజలను చూసి కొంతమంది వారి ఆత్మ బలిదానాలు వలన చలించి తెలంగాణ రాష్ట్రాన్ని ఈ ప్రభుత్వాలు ప్రకటిస్తాయి అనుకున్నారు, అలా చాలా మంది అమరులయ్యారు అలా అమరులైన ప్రతి అమరుడికి జోహార్లు అర్పిస్తూ, తెలంగాణ అస్తిత్వ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని ఇక్కడ ప్రజలు చెబుతుంటారు చివరిగా వివిధ పార్టీలు సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పిస్తూ కార్యక్రమాలు నిర్వహించిన అధికారికంగా సెప్టెంబర్ 17న ఇంతవరకు నిర్వహించలేదు కానీ ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం గా ప్రకటించి అధికారికంగా నిర్వహించబోతోంది దానికి తెలంగాణ ప్రజల తరుపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ దినోత్సవం రోజున ముందుగా సాయుధ పోరాటం, విద్యార్థి ఉద్యమం, మలిదశ ఉద్యమంలో అమరులైనటువంటి వీరులకు, ఆపరేషన్ పోలో అమరులైనటువంటి అమాయక ప్రజలకు, వీరులకు శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబాలకు సరైన న్యాయం చేసి, ఉద్యమమే ఊపిరిగా బతికినటువంటి ఉద్యమకారులను గుర్తించి వారి త్యాగాలకు తగిన గుర్తింపుని ఇవ్వాలని వారికి ఉద్యమకారుల పెన్షన్లతో గౌరవించాలని ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల్లో ఇళ్లను కట్టించి ఇవ్వాలని అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పెషల్ కోటను ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఈ ప్రభుత్వానికి ఉద్యమకారుల తరపున కోరుకుంటున్నాం. ఏదేమైనాప్పటికీ చరిత్రలో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిందని సాయుధ పోరాట అమరవీరుల చరిత్రను కనుమరుగు చేసే ప్రయత్నం ఇక్కడ ఆధిపత్య కులాలు మరియు ఆంధ్ర పెత్తందారులు ముఖ్యమంత్రులు చేసి, అమరవీరుల అస్తిత్వాన్ని కోల్పోయే విధంగా చేయడం దుర్మార్గమని ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం మన చరిత్రను ప్రపంచం మొత్తానికి తెలియజేసే విధంగా పుస్తకాలను రూపొందించి దేశ, విదేశాలకు తెలంగాణ చరిత్రను వ్యాప్తి చెందేలా చేయాలని కోరుకుంటూ ధన్యవాదాలు.

## కేజ్రీవాల్ ను తిరిగి సీఎంగా ప్రజలు ఎన్నుకుంటారు



న్యూఢిల్లీ,: కేజ్రీవాల్ ను ముఖ్యమంత్రి చేయడమే మా లక్ష్యం అని ఢిల్లీకి కాబోయే నూతన సీఎం ఆతిషీ అన్నారు. అయితే తనకు ఈ అవకాశం ఇచ్చిన ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు కృతజ్ఞతలు తెలిపిన ఆతిషీ.. కేజ్రీవాల్ నాపై నమ్మకంతో మరింత బాధ్యతలను అప్పజెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం కేజ్రీవాల్ పై తప్పుడు కేసులు పెట్టింది. సుప్రీంకోర్టు కేజ్రీవాల్ కు బెయిల్ ఇవ్వడం, కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు. అరవింద్ కేజ్రీవాల్ ను తిరిగి సీఎంగా ప్రజలు ఎన్నుకుంటారు అని పేర్కొంది. అలాగే అరవింద్ కేజ్రీవాల్ ఎంత నిజాయితీపరుడో ప్రజలకు తెలుసు. ఢిల్లీ ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని గుర్తించి కేజ్రీవాల్ ను సీఎం చేస్తారు. అప్పటివరకు ముఖ్యమంత్రిగా నేను బాధ్యతలు నిర్వహిస్తాను. నాకు శుభాకాంక్షలు పూలదండలు వద్దు . నాపై నమ్మకం ఉంచిన కేజ్రీవాల్ వరకు ధన్యవాదాలు . వచ్చే ఎన్నికల్లో కేజ్రీవాల్ గెలుపు తర్వాత కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటున్నాను. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కాకపోతే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మొహల్లా క్లినిక్, ఉచిత వైద్యం ఉండవు అని ఆతిషీ అన్నారు.

## రైతు కూలీలకు 12 వేలు : డిప్యూటీ సీఎం భట్టి




హైదరాబాద్ : ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటిస్తున్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మండల దళితబంధు లబ్ధిదారులకు నాగులవంచలో రెండోవిడుత యూనిట్ల మంజూరు పత్రాలను అందజేశారు భట్టి విక్రమార్క. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల చేత.. ప్రజల అవసరాలకోసం ఏర్పడినదే ఈ ప్రజాపాలన ప్రభుత్వం. భారత రాజ్యాంగం మేరకు ప్రజాపాలన కొనసాగుతుంది ప్రజాస్వామ్యాని గౌరవించ్చే ప్రతి ఒక్కరు ఈ ప్రజాపాలనను స్వాగతించాలి. గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమై ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పాలనానుండి విముక్తి కల్పించాం అని అన్నారు. ఇక ప్రజా పాలనలో అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతూ ముందుకు పోతున్నాం. రైతులకు పంట,వ్యక్తి ఇన్సూరెన్స్ తో పాటుగా సోలార్ పంపు సెట్లతో తో ఆదాయం వచ్చేలే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేలు చొప్పున ఇచ్చే ఆలోచన ప్రభుత్వం చేస్తుంది అని పేర్కొన్నారు. ఐకేపీ మహిళలు ద్వారా ఆర్గానిక్ ఫార్మిగ్ ఏర్పాటు చేసి రసాయనం లేని వ్యవసాయం చేసేలా కృషి చేస్తున్నాం. ప్రజాసంక్షేమం కోసమే మా పాలన పనిచేస్తుంది. పక్కదారి పట్టిన దళిత బందు యూనిట్లు తిరిగి తెచ్చే బాధ్యత అధికారులదే అని భట్టి విక్రమార్క స్పష్టం చేసారు.

## కుట్రలు ఎక్కువ రోజులు దాగవు..

## వరుస రైలు ప్రమాదాలపై హెూం మంత్రి అమిత్ షా



ఇంటర్నెట్‌డెస్క్: దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాల వెనక ఏదైనా కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. కుట్రలు ఎక్కువ రోజులు దాగి ఉండవని వ్యాఖ్యానించారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు ప్రభుత్వం అతి త్వరలోనే కీలక చర్యలు తీసుకొంటుందని వెల్లడించారు. ప్రభుత్వ పనితీరును ఆయన వివరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వే భద్రతపై ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఈ అంశంపై తాను చర్చించానని అమిత్‌షా పేర్కొన్నారు. 'రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూలకారణాలపై దర్యాప్తు చేస్తాం. కారణం ఏదైనా.. ప్రభుత్వం వీటిపై దృష్టి పెడుతుంది. ఇది కుట్ర అయితే.. ఎక్కువ కాలం కొనసాగదు. ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేస్తాం. ఇటీవల ఘటనలను దృష్టిలో పెట్టుకొని బలమైన ప్రణాళికను సిద్ధం చేసుకొంటున్నాం. మోదీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను అమిత్‌షా కొట్టిపారేశారు. అవి మొత్తం చిన్న ఘటనలని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారన్నారు. ఈ 100 రోజుల్లోనే ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోద ముద్రవేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో దాదాపు 4.42 కోట్ల మానవ పనిదినాల ఉపాధి లభిస్తుందని కేంద్ర హెూం మంత్రి వెల్లడించారు. ఇటీవల కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలు ప్రమాదాలు జరిగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే కొన్నాళ్ల క్రితం నివేదికలో వెల్లడించింది. అందులో ఆగస్టులో 15, సెప్టెంబర్‌లో 3 ఘటనలను గుర్తించారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌ర్వాత పంజాబ్, ఝూర?ండ్, రాజస్థాన్, మధ్యప్ర, తదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి. ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ తరహా ఘటనలు వెలుగుచూశాయి.

## స్టీల్ ప్లాంట్ ధ్వంసం చేయాలనే ఆలోచన కేంద్రానికి లేదు

హైదరాబాద్ : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ వ్యవహారం తిరిగి తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే స్టీల్ ప్లాంట్ ను మేము ప్రవేటీకరణకు గురి కానివ్వం అని వైసీపీ నేతలు కామెంట్స్ చేస్తున్న నేపథ్యంలో.. ఏపీ కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ రాష్ట్రం అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి ఈ వ్యవహారం పై స్పందించారు. తాజాగా ఆమె మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ను ధ్వంసం చేయాలనే ఆలోచన కేంద్రానికి లేదు. స్టీల్ ప్లాంట్ ని కాపాడి, లాభాల్లోకి తీసుకురావాలనేదే కేంద్రం ఉద్దేశం అని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఈ విషయంపై సానుకూలంగా స్పందించారు. ఇవాళ ప్రధాని మోదీ జన్మదినం.. బీజేపీకి ప్రత్యేకమైన రోజు. మోదీ పుట్టినరోజు సందర్భంగా రాజమండ్రి క్వారీ అన్నా క్యాంటిన్ ఒకరోజు ఖర్చును బీజేపీ భరించింది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కానుంది. ఇక రాజమండ్రిలో గౌతమీ నేత్రాలయం, రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు పురంధేశ్వరి.

## జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల నిరాకరణ చెల్లదు

### అక్రిడిటేషన్ రూల్స్‌లో కొంతభాగాన్ని కొట్టిసిన హైకోర్టు



హైదరాబాద్ **(గౌతమ్ న్యూస్):** చిన్న పత్రికల్లో పనిచేసే జిల్లా, నియోజక వర్గ స్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ - 2016లోని షెడ్యూల్ 'ఈ' ని కొట్టేస్తూ తాజాగా తీర్పు ఇచ్చింది. చిన్న వార్తాపత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం చెల్లదని పేర్కొంది. 2016లో జీవో 239 ద్వారా అప్పటి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సవాల్ చేస్తూ మహబూబ్‌నగర్‌కు చెందిన తాటికొండ కృష్ణ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న హై కోర్టు 'చిన్నపత్రికల్లో పనిచేసే జర్నలిస్టులను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా ఎందుకు విభజించారో సరైన వివరణ లేదు. తగిన వివరణ,సమర్థన లేకుండా మిగతావారితో సమానంగా గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం చెల్లదు. రెండు నెలలలో పారదర్శక మరియు హేతుబద్ధమైన ప్రాతిపదికన మార్గదర్శకాలు రూపొందించాలి' అని హై కోర్టు ఆదేశించింది.

# 'ట్యాపింగ్' కేసులో ఎమ్మెల్సీపై ఎల్ఓసీ

### ఈ వ్యవహారంలో నవీన్‌రావు పాత్రపై ఆధారాలు
### కొన్ని రోజుల క్రితం నోటీసుల జారీకి యత్నం
### ఆయన దుబాయ్ వెళ్లిపోవడంతో కుదరని వైనం
### దీంతో ఎల్ఓసీ జారీ చేసిన హైదరాబాద్ పోలీసులు



హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు పోలీసులు, మీడియా సంస్థకు చెందిన వారి చుట్టూనే దీని దర్యాప్తు తిరుగుతుండగా.. తాజాగా రాజకీయ నాయకులకు ఆ మకిలి అంటింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ నవీన్‌రావు పాత్రను ఈ వ్యవహారంలో రూఢీ చేసిన హైదరాబాద్ పోలీసులు ఆయనపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న నవీన్‌రావు దేశంలోకి అడుగు పెట్టిన వెంటనే అదుపులోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే విదేశాల్లో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, ఓ మీడియా సంస్థ అధినేత శ్రవణ్‌రావులపై ఎల్ఓసీ ఉంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న హైదరాబాద్ వెస్ట్‌జోన్ పోలీసులు ఈ ఏడాది జూన్ 29న హైకోర్టుకు ఓ నివేదిక సమర్పించారు. అందులో మూడు చోట్ల ఎమ్మెల్సీ పేరు ప్రస్తావించడంతో తొలిసారిగా నవీన్‌రావు పేరు వెలుగులోకి వచ్చింది. అక్రమ ఫోన్ ట్యాపింగ్‌కు కర్త, కర్మ, క్రియగా ఉన్న ప్రభాకర్‌రావుతోపాటు శ్రవణ్‌రావుతో కూడా కలసి నవీన్‌రావు పని చేశారన్నది ప్రధాన ఆరోపణ. అప్పటి అధికార పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు వీళ్లు ప్రయత్నించారని పోలీసులు ఆరోపించారు. దీనికోసం ఎస్ఐబీలో ప్రత్యేకంగా ఓ బృందాన్ని సైతం ఏర్పాటు చేశారు. నాటి ప్రతిపక్షంతో పాటు వివిధ విభాగాలకు చెందిన పలువురి ఫోన్ నంబర్లను ట్యాప్ చేయడంతో పాటు సున్నితమైన డేటాను అక్రమంగా సంగ్రహించారు. వివిధ రంగాలకు చెందిన వారిని బెదిరించడం ద్వారా ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేసేలా ఒత్తిడి చేశారని పోలీసులు చెపుతున్నారు.

### హార్డ్ డిస్కల ధ్వంసంలోనూ పాత్ర

గత ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. అదే సందర్భంలో ఎస్ఐబీ కార్యాలయంలోని పలు హార్డ్ డిస్కలను డీఎస్పీ ప్రణీత్‌రావు తదితరులు ధ్వంసం చేశారు. ఈ వ్యవహారం వెనుకా ప్రభాకర్‌రావుతో పాటు నవీన్‌రావు ఉన్నారని ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. సంధ్య కన్వెన్షన్స్ అధినేత ఎస్.శ్రీధర్‌రావును బెదిరించడం, ఆయన ఫోన్లు ట్యాప్ చేయడంతో పాటు ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేయించడంలోనూ నవీన్‌రావు పాత్రను దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు నవీన్‌రావును విచారించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి కొంత కాలం కిందట ఆయనకు నోటీసులు జారీ చేయడానికి ఓ ప్రత్యేక బృందం ముమ్మరంగా ప్రయత్నించింది. వాటి ఆధారంగా ఆయనను పిలిచి విచారించాలని భావించింది. నోటీసులతో అధికారులు నవీన్‌రావు ఇల్లు, కార్యాలయాల వద్ద కాపుకాసినా ఆయనను కలవలేక పోయారు. ఈ లోపు పోలీసుల కదలికలు తెలుసుకున్న నవీన్‌రావు దుబాయ్ వెళ్లిపోయారని తెలిసింది. ఆయన విదేశాలకు వెళ్లిపోయారనే సమాచారం ఆధారంగా హైదరాబాద్ పోలీసులు ఎల్ఓసీ జారీ చేయాలని నిర్ణయించారు. ఈ విషయాల్లో రాష్ట్రానికి సంబంధించిన నోడల్ ఏజెన్సీగా ఉన్న సీఐడీ ద్వారా ఎల్ఓసీని దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడ రేవులతో పాటు సరిహద్దుల్లో ఉన్న ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టులకు పంపారు. ఎల్ఓసీలో నవీన్‌రావు పాస్‌పోర్టు నంబర్, ఇతర వివరాలు పొందుపరిచారు. దీని ఆధారంగా ఆయన దేశంలో అడుగుపెట్టగానే ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుంటారని తెలుస్తోంది. అనంతరం ఆయనను హైదరాబాద్ పోలీసులకు అప్పగిస్తారని సమాచారం.

# ముసాయిదానే.. కొత్త చట్టం!

- భూరికార్డులకు సంబంధించి 'ఆర్ఓఆర్-2024' ముసాయిదానే ఫైనల్ చేయాలని సర్కారు నిర్ణయం
- ఒకట్రెండు అంశాల్లోనే మార్పులు.. అది కూడా మార్గదర్శకాల్లోనే సవరణ
- భూసమస్యల పరిష్కారానికి ట్రిబ్యునళ్ల ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు
- రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు,కొత్త చట్టానికి సంబంధం లేదంటున్న రెవెన్యూ వర్గాలు
- ముసాయిదాలోని సెక్షన్-4 ప్రకారం కూడా ఏర్పాటు చేయవచ్చంటున్న నిపుణులు
- ఆర్డీవో స్థాయిలోనూ అప్పీల్ అవకాశం ఉండాలనే సూచనలపై అస్పష్టత
- కొత్త చట్టంపై వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలా? అసెంబ్లీలో చర్చించి ఆమోదించే దాకా ఆగాలా అన్న దానిపై తర్జనభర్జన
- 20వ తేదీన జరిగే కేబినెట్ ఎజెండాపై బుధవారం రానున్న స్పష్టత

హైదరాబాద్: రాష్ట్రంలో భూముల రికార్డులకు సంబంధించిన 'రికార్డ్ ఆఫ్ రైట్స్-2024 (ఆర్‌వోఆర్)' చట్టం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి వచ్చింది. ఒకట్రెండు చిన్న చిన్న మార్పులు మినహా ముసాయిదా కింద రూపొందించిన అంశాలనే చట్టం రూపంలో అమల్లోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి త్వరలోనే దీనిపై ఓ స్పష్టత ఇస్తారని.. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాక తుది నిర్ణయం ప్రకటిస్తారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.దాంతోపాటు ఈ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు మంత్రివర్గం ఆమోదంతో ఆర్డినెన్స్ జారీ చేస్తారా? లేక అసెంబ్లీలో పెట్టిన బిల్లుపై విస్తృతంగా చర్చించి చట్టంగా చేస్తారా? అన్న దానిపై మాత్రం తర్జనభర్జన కొనసాగుతున్నట్టు వెల్లడించాయి. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈనెల 20న జరిగే కేబినెట్ సమావేశం ముందుకు ఆర్డినెన్స్ వచ్చే అవకాశం లేదని అంటున్నాయి. అయితే కేబినెట్ ఎజెండాపై బుధవారం స్పష్టత వస్తుందని, ఎజెండాలో భూముల చట్టం ఆర్డినెన్స్ ఉంటే రూపకల్పన, జారీ ఏర్పాట్లకు సిద్ధంగానే ఉన్నామని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.



### ముసాయిదా బిల్లు ఇదే..

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం 'ఆర్‌వోఆర్-2024' ముసాయిదాను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆర్‌వోఆర్-2020 చట్టంలో పరిష్కరించలేని అనేక సమస్యలకు పరిష్కారం చూపుతూ 20 సెక్షన్లతో ఈ ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. 1936, 1948, 1971, 2020 నాటి ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి, వాటి అమలుతో చేకూరిన ఫలితాలను బేరీజు వేసి కొత్త చట్టం ముసాయిదాను తయారు చేసింది. తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టాల అమలు చరిత్ర, ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాల అంచనాల ప్రకారం రూపొందించిన ఈ ముసాయిదాలో పాస్ పుస్తకాలు రాని భూముల సమస్యల పరిష్కారం, కొత్త రికార్డును ఎప్పుడైనా తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూఆధార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ లాంటి వెసులుబాట్లు కల్పిస్తూ అనేక అంశాలను ముసాయిదాలో పొందుపరిచారు.

### బిల్లు పెట్టిన తర్వాత ఏం జరిగిందంటే..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఆర్‌వోఆర్ చట్టానికి రెండోసారి మార్పు జరుగుతోంది. 2020లో బీఆర్ఎస్ హయాంలో ఆర్‌వోఆర్-2020 చట్టం అమల్లోకి తెచ్చారు. అందులోని అనేక అంశాలకు సవరణలు, మార్పు చేర్పులతో ఆర్‌వోఆర్-2024ను కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ముందు పెట్టింది. ముసాయిదాపై ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి 23 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. మంత్రులు, రెవెన్యూ శాఖ సీనియర్ అధికారులు, భూచట్టాల నిపుణులు, మేధావులు, సామాన్యులు.. ఇలా అన్ని వర్గాలు అభిప్రాయాలు స్వీకరించింది. ఈ వివరాలతో జిల్లాల కలెక్టర్లు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

### ఆ మూడు అంశాలే కీలకం

ప్రజలతోపాటు భూచట్టాల నిపుణుల నుంచి వచ్చిన అనేక సూచనలు, సలహాల్లో మూడు అంశాలు కీలకమని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటు ప్రతిపాదన ముసాయిదా చట్టంలో లేదని.. భూసమస్యల పరిష్కారం కోసం ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని పలువురు సూచించారు. అయితే రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు, ఆర్ఓఆర్ చట్టానికి సంబంధం లేదని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. అయితే భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా పార్ట్-బీలో పెట్టిన 18లక్షల ఎకరాల భూముల సమస్యలను పరిష్కరించేందుకు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి కూడా ఉందని అంటున్నాయి. ఇందుకోసం ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వొచ్చని, లేదా ముసాయిదా చట్టంలోని సెక్షన్-4 ప్రకారం కూడా ఏర్పాటు చేయవచ్చని పేర్కొంటున్నాయి. ఇక అప్పీల్, రివిజన్లకు సంబంధించిన అంశంలోనూ చాలా సూచనలు వచ్చాయి. తహసీల్దార్లు, ఆర్డీవోలు చేసే రిజిస్ట్రే?షన్లు, మ్యుటేషన్లకు సంబంధించి వివాదాలు వస్తే అప్పీల్‌ను కలెక్టర్లు లేదా అడిషనల్ కలెక్టర్‌కు చేసుకోవాలని.. సెకండ్ అప్పీల్‌ను సీసీఎల్ఏకు, రివిజన్ కోసం ప్రభుత్వానికి లేదంటే సీసీఎల్ఏకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చట్టంలో ప్రతిపాదించారు. అయితే ఈ అప్పీల్ అవకాశం ఆర్డీవో స్థాయిలోనూ ఉండాలని పలువురు సూచించారు. రిజిస్ట్రే?షన్, మ్యుటేషన్ చేసేటప్పుడు సర్వే మ్యాప్ తప్పనిసరి అని.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూఆధార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇస్తామన్న ప్రతిపాదనలపైనా పలు సూచనలు వచ్చాయి. వీటి విషయంలో ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో తేలాల్సి ఉంది.

### సాదాబైనామాలకు అవకాశం

ఆర్‌వోఆర్-2024 చట్టం అమల్లోకి వస్తే పెండింగ్‌లో ఉన్న 9.4 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుంది. ఈ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని ప్రత్యేక సెక్షన్‌లో ప్రతిపాదించారు. ఇక అసైన్డ్ భూముల సమస్య పరిష్కారానికి ఈ చట్టంలో ఎలాంటి ప్రస్తావన లేదనే విమర్శలున్నాయి. అయితే అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడానికి, ఆర్‌వోఆర్ చట్టానికి సంబంధం లేదని.. అసైన్డ్ భూములపై హక్కులు రావాలంటే హక్కుల బదలాయింపు నిషేధిత చట్టాన్ని (పీవోటీ) సవరించాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు వివరిస్తున్నాయి. మొత్తమ్మీద ముసాయిదా చట్టంలో ఒకట్రెండు అంశాల్లోనే మార్పు ఉంటుందని.. అది కూడా మార్గదర్శకాలు తయారు చేసినప్పుడు వాటిలో పొందుపరుస్తారని పేర్కొంటున్నాయి.

# మహిళా సాధికారతే దేశానికి బలం

### షిశక్తి సమ్మిట్-2024లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: దేశంలో మహిళల సాధికారతే ఆ దేశానికి నిజమైన బలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఏ ప్రాంతంలో అయినా, ఎలాంటి సమయంలోనైనా మహిళలు అభద్రతకు లోనవకుండా, వారి పట్ల గౌరవం చూపేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మన దేశంలో మహిళల గౌరవాన్ని, గౌరవాన్ని కాపాడతామని, వారి పురోభివృద్ధికి కృషి చేస్తామని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓ వార్తా సంస్థ సోమవారం నిర్వహించిన షిశక్తి సమ్మిట్-2024లో రాష్ట్రపతి మాట్లాడుతూ దేశంలో మహిళల భద్రతకోసం కఠినమైన చట్టాలను తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ అభద్రతా భావం కొనసాగుతుండటం దురదృష్టకరమని, మహిళలను బలహీనులుగా భావించే సామాజిక సంకుచిత మనస్తత్వం, ఛాందసవాదానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేయాల్సిన అవసరముందని ఆమె నొక్కి చెప్పారు. సమాజంలో ఎన్ని మార్పులొచ్చినా కొన్ని సామాజిక దురభిప్రాయాలు లోతుగా పాతుకుపోయాయని, ఇవి మహిళా సమానత్వానికి అవరోధాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. "ఎక్కడ తప్పు చేశాం? మెరుగుపడటానికి మనం ఏమి చేయాలి?"అని మహిళలు నిరంతరం ప్రశ్నించుకోవాలని సూచించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా శక్తి, ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నారని మహిళలను కొనియాడారు.

పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలి: సీజేఐ

చట్టం మాత్రమే న్యాయమైన వ్యవస్థను తయారు చేయలేదని, సమాజం మహిళల పట్ల తన మైండ్‌సెట్‌ను మార్చుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం నొక్కి చెప్పారు. ప్రతిఒక్కరూ పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలని సూచించారు. మహిళల ప్రయోజనాలను



పరిరక్షించడానికి విధానపరమైన, చట్టపరమైన నిబంధనలు అనేకం ఉన్నాయని, కానీ కఠినమైన చట్టాలే సమ సమాజాన్ని నిర్మించలేవన్నారు. మహిళలకు రాయితీలు ఇవ్వడం నుంచి స్వేచ్ఛగా, సమానంగా జీవించే హక్కు వారికుందనే విషయాన్ని గుర్తించే దిశగా మన మనస్తత్వాలు మార్చుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కుల గురించి మాట్లాడటమంటే మొత్తం సమాజం మార్పు గురించి మాట్లాడినట్లని వ్యాఖ్యానించారు. తన జీవితంలోని కొన్ని గొప్ప పాఠాలను మహిళా సహోద్యోగుల నుంచే నేర్చుకున్నానని, మెరుగైన సమాజానికి మహిళల సమాన భాగస్వామ్యం ముఖ్యమని తాను నమ్ముతానని చెప్పారు. దేశం రాజ్యాంగాన్ని ఆమోదించక ముందే ఇండియన్ ఉమెన్స్ చార్టర్ ఆఫ్ లైఫ్‌ను స్త్రీవాది అయిన హంసా మెహతా రూపొందించారని సీజే గుర్తు చేశారు.

## వరద బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



**అమరావతి,:** వరద ప్రభావిత ప్రాంతలలో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. రాణిగారితోట 17, 18వ డివిజన్ లలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాశ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. నగరంలోని వరద బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెద్ద మనసుతో ఒక కోటీ పది లక్షల సహాయం మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు అని ఆయన తెలిపారు. యాభై వేల కుటుంబాలకు నిత్యవసర సరుకులను ఇంటి ఇంటికీ పంపిణీ చేస్తున్నాం.. తూర్పు నియోజకవర్గంలో 15, 16, 17, 18 డివిజన్ లలో వరద ప్రభావానికి గురైన నాలుగు డివిజన్ లలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. ఈ వరదలకు టీడీపీ, చంద్రబాబు ప్రభుత్వం వైఫల్యం కారణం కాదా అని దేవినేని అవినాష్ ప్రశ్నించారు. ఇకనైనా చంద్రబాబు కక్ష సాధింపు చర్యలు మాని పాలనపై దృష్టి పెట్టాలి అని విజయవాడ తూర్పు నియోకవర్గ ఇంఛార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. ఇప్పటికే వరద నష్ట ప్రభావం ప్రజలపై వుంది.. గెలుపు ఓటములుతో సంబంధం లేకుండా నిస్వార్ధ సేవ చేస్తున్నాం.. 100 రోజుల కూటమి అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు చర్యలు తప్ప చేసిందేమీ లేదు.. కృష్ణలంకకు రిటైనింగ్ వాల్ లేకపోతే సగం విజయవాడ మునిగిపోయేది.. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతీ కుటుంబం లక్ష రూపాయలు పైగా నష్టపోయారు.. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోషల్ మీడియా ప్రచారం చేసుకునే పనిలో ఉన్నాడు.. రిటైనింగ్ వాల్ నిర్మించిన జగన్ కు ఎప్పటికీ రుణ పడి వుంటామని ప్రజలు చెబుతున్నారు.. కుటుంబంకు అవసరమయ్యే తొమ్మిది రకాల నిత్యవసర సరుకులు కిట్ రూపంలో పంపిణీ నేడు చేస్తున్నాం.. మంత్రులే అధికారులను తిడుతున్నారంటే టీడీపీ పాలన ఎలా వుందో అర్థం చేసుకోవచ్చు దేవినేని అవినాష్ అన్నారు.

## 20 ఎంబీ స్పీడ్ తో ప్రతి ఇంటికి ఇంటర్ నెట్..

### ఐటీ మంత్రి సంచలన ప్రకటన



**హైదరాబాద్, :** తెలంగాణ గ్రామ ప్రజలకు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు శుభవార్త చెప్పారు. కేంద్ర సహకారంతో టీ ఫైబర్ నెట్ట ద్వారా అన్ని గ్రామాలకు 20 ఎంబీ స్పీడ్ తో ఇంటర్ నెట్ ఇచ్చేందుకు నిర్ణయించామని శ్రీధర్ బాబు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్17 ని ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతున్నామన్నారు. ఆనాడు గడీల పాలన పై పోరాడారు తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కూడా తెలంగాణ ప్రజలు గడీల పాలన ని పోగొట్టి మార్పు కోరుకున్నారు. ఆ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గత 8 నెలలుగా మేము పని చేస్తున్నామన్నారు. తెలంగాణలో కేంద్ర సహకారంతో అన్ని గ్రామాలకు టీ ఫైబర్ నెట్ట ద్వారా అన్ని గ్రామాలకు 20 ఎంబీ స్పీడ్ తో ఇంటర్ నెట్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే 9 వేల గ్రామాలకు ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్రాన్ని 9 వేల కోట్లు సాయం ఆడిగాము ఇంకా 5 వేల గ్రామాల వరకు కనెక్టివిటీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 3 గ్రామాలను నేట్వర్క్ పైలెట్ ప్రాజెక్ట్ గా తీసుకున్నామన్నారు. సంగారెడ్డి జిల్లా సంగుపేట నారాయణ పేట జిల్లా మద్దూరు పెద్దపల్లి జిల్లా అదవి శ్రీరామ్ పూర్ గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసామని తెలిఆపరు. ఈ సేవల్లో ఇంటర్ నెట్ తో పాటు కేబుల్ టీవీ ప్రసారాలు లభిస్తాయన్నారు. ఆయా గ్రామాల్లో 360 డిగ్రీలు సిసి కెమెరాలు, ఏఐ టెక్నాలజీ వాడతామన్నారు. పైలెట్ గ్రామాల్లో రెండు నెలల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించి డిసెంబర్ లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే యోచనలో ఉన్నామని అన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం ఎందుకు పెడుతున్నామో నిన్న సీఎం చెప్పారన్నారు. రాజీవ్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసింది.. రాజీవ్ ప్రాణాలను ఇచ్చారని తెలిపారు. ఆ మహనీయుని విగ్రహం పెడితే ఎందుకు అంత అసూయ.. ఈర్ష్య అని మండిపడ్డారు. అమిత్ షా, మోడీ ల దగ్గర ప్రశంసలు పొందేందుకు బిఅరెస్ రాజీవ్ విగ్రహం విషయంలో రాద్దాంతం చేస్తున్నారు.. బీజేపీ కి దగ్గరయ్యే ప్రయత్నంలో భాగమే ఇది అని అన్నారు. హైడ్రా అనేది రాష్ట్ర వనరులను కాపాడే వ్యవస్థ ఇతర అంశాలను డైవర్ట్ చేసేది కాదన్నారు. ఆరు గ్యారంటీల అమలు పక్కా పూర్తి చేస్తామన్నారు.

## ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు పరిశీలించిన మంత్రులు..



**అమరావతి,:** ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపును మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత పరిశీలించారు. ఇంజనీర్లను బోట్ల తొలగింపు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు మంత్రులు. జరిగిన బోటు తొలగింపు విధానాలను హోంమంత్రి వంగలపూడి అనితకి వివరించారు నిమ్మల. ఈ సంద్రాభంగా హోమ్ మంత్రి మాట్లాడుతూ.. జత్వానీ కేసులో ఎవరినీ బలిపశువులను చేయడం లేదు., గత ప్రభుత్వంలో బలి పశువులను చేసారు. బోట్ల తొలగింపుకు అన్నిరకాల సహకారం అందిస్తాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించుకోవచ్చు. అనలిస్టులు టీవీల ముందు మాట్లాడేప్పుడు ఆలోచించాలి. వందల బోట్లు కట్టేసి ఉంటే ఈ మూడే ఎందుకొచ్చాయని వ్యాఖ్యానించారు. ఇక జలవనరులశాఖమంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఇంజినీర్లు తీవ్రంగాశ్రమిస్తున్నా బోట్లు భారీగా ఉండటంతో బోటు బయటకు రావడం లేదు., తొలుత క్రేన్లతో, ఎయిర్ బెలూన్లతో లేపేందుకు యత్నించినా ఫలితం రాలేదు. బోట్లు భారీగా ఉండటంతో డైవింగ్ టీంతో కట్ చేసేందుకూ సాధ్యపడటం లేదు. అబ్బులు టీం సైతం పలు విధాలుగా ప్రయత్నించినా బోటు బయటకు రాలేదు. సీఎం చంద్రబాబు, లోకేష్ సమీక్షిస్తూ ఏజన్సీకి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వెలికి తీయాలని ఆదేశించారని., ఒక్కో బోటు 80-100 టన్నుల బరువు ఉంటుందని నిపుణులు చెప్పినట్లు ఆయన అన్నారు. అధికారులు, ఇంజినీర్లు చేసే కొత్త ప్లాన్ తో ఇవాల బోట్లు వెలికితీత కొలిక్కి వస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## జనగణనను ప్రకటిస్తే. బహిరంగంగానే చెబుతాం



అమిత్‌షా : త్వరలో జనగణన చేపడతామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని మోడీ 3.0 ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే జనగణన చేపడతామని, మేము జనగణనను ప్రకటిస్తే ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని కచ్చితంగా బహిరంగంగా చెబుతాం అని అమిత్‌షా అన్నారు. 60 ఏళ్ల తర్వాత తొలిసారి రాజకీయ సుస్థిరత నెలకొన్నది. మాకు విధానాలను అమలు పరచడం, వాటి కొనసాగింపునకు సంబంధించిన అనుభవం కూడా ఉంది. మొదటిసారి భారత్ విదేశాంగ విధానంలో మెరుగ్గా ఉంది. అంతర్గతంగానూ, బాహ్యంగానూ భారత్ దృఢమైన యంత్రాంగాన్ని కలిగి ఉందని అమిత్‌షా అన్నారు. 3.0 మోడీ గవర్నమెంట్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు లక్షల కోట్ల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆమోదించింది. మధ్యతరగతికి ప్రజానీకానికి పన్నులు లాభం చేకూరేలా మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు క్రెడిట్ గ్యారెంటీ పథకం, 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ బీమా సౌకర్యం, మూడు కొత్త క్రిమినల్ చట్టాలు, ఇతర కొన్ని పథకాలను చేపట్టడం జరిగిందని అమిత్‌షా అన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తామని, చేపట్టబోయే పనులు త్వరగా పూర్తిచేసేందుకు లోక్‌సభ ఎన్నికలకు ఆరు నెలల ముందే బ్యూరోక్రసీని మోడీ కోరినందున మేము అనుకున్న పనులను పూర్తిచేయగలిగాం. కొత్త ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని అమిత్‌షా అన్నారు. రైలు ప్రమాదాలపైనా తాము దృష్టిసారించామని, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా రక్షణ పథకంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని అమిత్‌షా తెలిపారు.

# విశాఖ ఉక్కులో డిప్యుటేషన్ల రగడ

### నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌కు అధికారులు, ఉద్యోగుల డిప్యుటేషన్

### మొదటి దశలో 100 మంది అధికారులు

### 23 నుంచి ఇంటర్వ్యూలు

### వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు



ఉక్కు నగరం (విశాఖ): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌కు డిప్యుటేషన్‌పై పంపేందుకు రంగం సిద్ధమైంది. తమకు అవసరమున్న పోస్టులు, విధివిధానాలు, ఇంటర్వ్యూలకు సంబంధించిన వివరాలు నగర్‌నార్ ప్లాంట్ నుంచి వచ్చిన లేఖ ద్వారా బయటకు పొక్కాయి. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో చేపడుతున్న అనేక పొదుపు చర్యల్లో భాగంగా 500 మంది అధికారులు, ఉద్యోగులను నగర్‌నార్ ప్లాంట్‌కు డిప్యుటేషన్‌పై పంపాలని యాజమాన్యం నిర్ణయించింది. తద్వారా ప్లాంట్‌పై ఆర్థిక భారం తగ్గుతుందని యాజమాన్యం ప్రకటించింది.

#### దశలవారీగా డిప్యుటేషన్

దశలవారీగా పంపనున్న జాబితాలో మొదటి విడతగా 100 మంది అధికారులను డిప్యుటేషన్‌పై పంపేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఉక్కు యాజమాన్యం నగర్‌నార్ ప్లాంట్ యాజమాన్యానికి ఈ నెల 11న లేఖ రాసింది. ఆ లేఖపై స్పందిస్తూ నగర్‌నార్ ప్లాంట్ యాజమాన్యం తమకు కావాల్సిన సిబ్బంది, విధివిధానాలపై విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి లేఖ రాసింది. అధికారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరుతూ ఓ నమూనాను పంపింది. అధికారులకు కావాల్సిన విభాగాలు, గ్రేడ్‌లకు చెందిన సిబ్బంది వివరాలను ఆ లేఖలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 23 నుంచి 25 వరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోనే ఇంటర్వ్యూలు చేయనున్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా డిప్యుటేషన్ అంశాన్ని మొదటి నుంచీ పూర్తిగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు నగర్‌నాగర్ ప్లాంట్ నుంచి వచ్చిన లేఖను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేఖలోని విధి విధానాల్లో క్లారిటీ లేదని, ఉద్యోగుల వ్యక్తిగత అంగీకారంతో డిప్యుటేషన్ అంటే.. జరిగే పని కాదని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు వ్యాఖ్యానించారు.

#### డిప్యుటేషన్ ప్రతిపాదనను విరమించుకోవాలి


స్టీల్‌ప్లాంట్‌లో మొత్తం 20 వేల మంది ఉద్యోగులు ఉండేవారు. ప్రస్తుతం 12,600 మంది మాత్రమే ఉన్నారు. ఇందులోంచి కూడా ఉద్యోగులను ఇతర ప్లాంట్లకు డిప్యుటేషన్‌పై పంపిస్తామంటే మేం ఎలా అంగీకరిస్తాం. ఉన్న ఉద్యోగులను ఉపయోగించి పూర్తి ఉత్పత్తి సాధించాలి గానీ.. డిప్యుటేషన్‌కు పంపడమేంటి. దీనిని మేం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. యాజమాన్యం ఆ ప్రతిపాదనను విరమించుకోవాలి. - జె.అయోధ్యరామ్, గౌరవాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ

# వచ్చేస్తోంది మార్స్ ట్రాన్స్‌ఫర్ విండో!

### అంగారక ప్రయోగాలకు అత్యంత అనువు

### ప్రయోగాలకు అంతరిక్ష సంస్థల సన్నాహాలు

### 2026 విండోలో మిషన్ మార్స్: స్పేస్‌ఎక్స్ సక్సెసైతే 2028లో మానవసహిత మిషన్



మరొక్క నెల రోజులే! సైంటిస్టులంతా రెండేళ్లుగా ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఎర్త్-మార్స్ ట్రాన్స్‌ఫర్ విండో' అక్టోబర్లో అందుబాటులోకి రానుంది. 2022 నాటి ట్రాన్స్‌ఫర్ విండో సందర్భంగా నాసా వంటి అంతరిక్ష సంస్థలు పలు అంగారక ప్రయోగాలు చేశాయి. భావి మార్స్ మిషన్లకు అవసరమైన సామగ్రిని అంగారకునిపైకి ముందే చేరేసేందుకు ప్రయత్నించాయి. మరో నెల రోజుల అంతరం అక్టోబర్ 'విండో'లో కూడా అలాంటి ప్రయోగాలు చేపట్టే దిశగా యోచిస్తున్నాయి.

#### ఏమిటీ ట్రాన్స్‌ఫర్ విండో?

ఇది భూ, అంగారక గ్రహాలు రెండూ పరస్పరం అత్యంత సమీపానికి వచ్చే సమయమని చెప్పవచ్చు. కనుక సహజంగానే ఆ సందర్భంగా భూమికి, అంగారకునికి మధ్య దూరం అత్యంత తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో అతి తక్కువ ఇంధన వ్యయంతో అంగారక ప్రయోగాలు సాధ్యపడుతాయి. ఫలితంగా ప్రయోగ ఖర్చుతో పాటు అరుణ గ్రహాన్ని చేరేందుకు పట్టే సమయమూ తగ్గుతుంది. కేవలం 6 నుంచి 8 నెలల్లో అంగారకున్ని చేరవచ్చు. అదే ఇతర సమయాల్లో అయితే ఏళ్ల కొద్దీ సమయం పడుతుంది. వీటన్నింటికీ మించి ట్రాన్స్‌ఫర్ విండోలో ప్రయోగించే అంతరిక్ష నౌక అంగారకుడు అత్యంత అనువైన పొజిషన్‌లో ఉండగా దాని కక్ష్యలోకి ప్రవేశించగలుగుతుంది. కనుక ప్రయోగం విజయవంతమయ్యే అవకాశం ఎన్నో రెట్లు పెరుగుతుంది. భూమి, అంగారకుల మధ్య ఈ విండో దాదాపు 26 నెలలకు ఓసారి పునరావృతమవుతూ ఉంటుంది. హాన్‌మన్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ సూత్రం ఆధారంగా దీన్ని లెక్కిస్తారు. ఈ విండో సమయాన్ని కచ్చితంగా లెక్కించడం అంతరిక్ష సంస్థలకు చాలా కీలకం. లేదంటే ప్రయోగం రెండేళ్లు ఆలస్యమయ్యే ప్రమాదముంటుంది.

#### 2026 విండోపై స్పేస్ ఎక్స్ కన్ను

ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్ తన అంగారక యాత్ర సన్నాహాలకు మరింత పదును పెడుతోంది. అంతా అనుకున్నట్టుగా జరిగితే 2026లో అంగారకునిపైకి మానవరహిత 'స్టార్‌ప్' మిషన్ చేపట్టనున్నట్టు సంస్థ అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఆ ఏడాది 'ఎర్త్-మార్స్ ట్రాన్స్‌ఫర్ విండో' సందర్భంగా ప్రయోగం ఉంటుందని వెల్లడించారు. అంతరిక్ష నౌక సజావుగా అరుణ గ్రహంపై దిగి తమ మిషన్ విజయవంతమైతే మరో రెండేళ్లలో, అంటే 2028 నాటికి మానవసహిత అంగారక యాత్ర ఉంటుందని చెప్పారు. నాసా, ఇతర అంతరిక్ష సంస్థలు కూడా 20206 విండో సందర్భంగా అంగారకునిపైకి మరింత అదనపు సామగ్రి తదితరాలను చేరవేసేందుకు ఇప్పట్నుంచే ప్రణాళికలు వేస్తున్నాయి.

# రాజీనామా వ్యూహం



రాజకీయాల్లో వ్యూహ ప్రతివ్యూహాలు కీలకం. అందులోనూ ప్రత్యర్థి ఊహించని రీతిలో ఎత్తుగడలు వేయడం మరీ అవసరం. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రథసారథి అరవింద్ కేజ్రీవాల్ ఆ సంగతి ఒంట బట్టించుకున్నారు. ఇమేజ్ పడిపోతోందనుకున్న ప్రతిసారీ ఏదో ఒక ప్రకటన, వినూత్న నిర్ణయంతో మళ్ళీ పుంజుకొనే ఆయన ఈసారీ అదే పద్ధతిని అనుసరించారు. మద్యం పాలసీ కేసు వ్యవహారంలో ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి విడుదలైన రెండు రోజులకే ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ తీసుకున్న అనూహ్య నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. సీఎం పదవి నుంచి వైదొలగాల్సిందిగా బీజేపీ కొన్ని నెలలుగా డిమాండ్ చేస్తున్నా కిమ్మనాస్తిగా ఉన్న కేజ్రీవాల్ ఇప్పుడే ఎందుకీ నిర్ణయం తీసుకున్నారన్నది ఆసక్తి రేపుతోంది. సీనియర్ మంత్రులు ఆతిషి, సౌరభ్ భరద్వాజ్ మొదలు కేజ్రీవాల్ సతీమణి సునీత దాకా స్వల్పకాలిక కొత్త సీఎం ఎవరవుతారనే చర్చ జరుగుతోంది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సోమవారం సమావేశమై చర్చించగా, మంగళవారం ఉదయం కొత్తనేత ఎంపికకై శాసనసభా పక్ష సమావేశం, సాయంత్రం రాజీనామా లేఖ ఇచ్చేందుకు లెఫ్టినెంట్ గవర్నర్‌తో కేజ్రీవాల్ భేటీ జరగనుండేసరికి ఢిల్లీ రాజకీయం వేడెక్కింది. అసెంబ్లీని అసలు రద్దు చేయాలనే ఆలోచన కూడా ఉన్నా, కొన్నేళ్ళ క్రితం ఆప్ అసెంబ్లీని రద్దు చేసి, తక్షణ ఎన్నికలకు సిఫార్సు చేసినప్పుడు చెవికెక్కించుకోకుండా కేంద్రం తరువాతెప్పుడో తాపీగా ఎన్నికలు పెట్టింది. ఈసారి కూడా ఆ ప్రమాదం ఉన్నందున కేజ్రీవాల్ చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ప్రజాక్షేత్రంలో తీర్పుతో నిజాయతీ నిరూపించుకొని మళ్ళీ సీఎం కుర్చీలో కూర్చొంటానంటూ కేజ్రీవాల్ ఆదివారం చేసిన భీషణ ప్రతిజ్ఞ వెనుక బయటకు చెప్పని కారణాలు అనేకం. సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సహా ఆప్ నేతలు పలువురు ఇప్పటికే అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయారు. అందుకే... 2011లో అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి ప్రభవించిన పార్టీ తమపై వచ్చిన ఆరోపణల్ని తిప్పికొట్టేందుకు ఎన్నికల మార్గం ఎంచుకుంటోంది. అగ్నిపరీక్షకు సిద్ధం అనడం తెలివైన ఎత్తుగడే. రాజీనామా నిర్ణయం రాజకీయ సిక్సర్ అని కొందరు విశ్లేషకులు అంటున్నది అందుకే. అవినీతి మచ్చను తుడుచుకోవడం దగ్గర నుంచి పెరుగుతున్న అధికారపక్ష వ్యతిరేకతను తగ్గించుకోవడం వరకు అనేక విధాలుగా ఈ నిర్ణయం కేజ్రీవాల్‌కు ఉపకరించవచ్చు. ప్రతిపక్ష శిబిరం వల్ల పెరిగిన బీజేపీ వ్యతిరేకత నుంచి లబ్ధి పొందనూవచ్చు. నిర్ణీత కాలవ్యవధి ప్రకారం చూసినా వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది గనక అయిదు నెలల ముందు రాజీనామా వల్ల కేజ్రీవాల్ వస్తే లాభమే తప్ప, పోయేదేమీ లేదు. తాజాగా బెయిలిస్తూ, సీఎం ఆఫీసుకు వెళ్ళరాదు, అధికారిక ఫైళ్ళపై సంతకాలు చేయరాదు, కేసుపై బహిరంగ ప్రకటనలు చేయరాదంటూ సుప్రీమ్ కోర్ట్ పెట్టిన కఠిన నిబంధనల రీత్యా కేజ్రీవాల్ ఎలాగూ సీఎంగా వ్యవహరించలేరు. కాబట్టి, పదవికి రాజీనామా చేస్తూ, మహారాష్ట్రతో పాటు నవంబర్‌లోనే ముందస్తు ఎన్నికలు జరపాలంటూ ఆయన పోరుబాట పట్టారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ 'ప్రతీకార రారాజీనామా వ్యూహంజకీయాలు' చేస్తోందని ఆరోపిస్తూ, బాధితుడిగా తనను తాను చూపించుకోవ డానికి కూడా ఆయనకు ఇదే సరైన సమయం. ఎలాగూ ఎన్నికలు జరిగేంత వరకు ఈ కొద్ది కాలం వేరెవరో సీఎంగా ఉన్నా, చక్రం తిప్పేది కేజ్రీవాలే! కనుక బాధ లేదు. అదీ కాక, మధ్యలో కేంద్ర పాలన ఉన్న ఒక్క ఏడాది మినహా 2013 డిసెంబర్ నుంచి ఢిల్లీని ఏలుతున్నందున ఓటర్లలో వ్యతిరే కత పేరుకుంది. దాని నుంచి తప్పించుకోవడానికీ, క్షేత్రస్థాయిలో జనంతో మమేకమై ముచ్చటగా మూడోసారి పార్టీ విజయావకాశాల్ని మెరుగుపరచడానికీ ఈ రాజీనామా డ్రామా అక్కరకొస్తుంది. అయితే, ఇందులో కొన్ని రిస్కులూ లేకపోలేదు. గడచిన 20 నెలల పైచిలుకు కాలంలో ప్రధాన ఆప్ నేతలు పలువురు ఏదో ఒక అంశంలో జైలుకెళ్ళారు. మద్యం కుంభకోణం వ్యవహారం, కేంద్రం వర్సెస్ ఢిల్లీ సర్కార్‌ల గొడవ మధ్య పాలన పడకేసింది. ఢిల్లీలో ప్రాథమిక పౌర వసతులు కుప్పకూలాయి. ఆ మధ్య అన్యాయంగా ముంచెత్తిన వాన నీళ్ళలో చిక్కుకొని ఐఏఎస్ శిక్షణార్థులు ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అందుకు ఓ మచ్చుతునక. బడి చదువులు, ఆరోగ్య వసతులు సమూలంగా మార్చేస్తామంటూ ఆప్ అధికారంలోకి వచ్చినా, ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌లో పరిస్థితి తద్విరుద్ధంగా ఉంది. వీటన్నిటి నుంచి జనం దృష్టి మరల్చడం అంత సులభమేమీ కాదు. అసెంబ్లీ రద్దు చేయకుండా నవంబర్‌లో ఎన్నికలనేవి మాటల్లోనే తప్ప చేతల్లో సాధ్యం కాదు. రద్దు చేసి అడిగినా, నవంబర్‌లోనే ఎన్నికలు పెట్టడం తప్పనిసరి కాదు. ఒకవేళ నవంబర్‌లోనే ఎన్నికలొస్తే ఆప్‌కు సమయం సరిపోతుందా అన్నదీ ప్రశ్నార్థకమే. ఎన్నికలు జాప్యమైతే అనేక ఇతర రాష్ట్రాల్లోని పార్టీలలో లాగే కొత్త సీఎంతో ఆప్‌లో అసమ్మతి పెరిగే ప్రమాదమూ లేకపోలేదు. ఆప్ ఇప్పుడు కీలకమైన కూడలిలో ఉంది. ఢిల్లీ, ఆ తర్వాత పంజాబ్‌లలో సత్తా చాటినా, ఇతర రాష్ట్రాలకు విస్తరించడంలో విఫలమైంది. ఇప్పుడు ఢిల్లీలోనే అగ్నిపరీక్షను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే విలాసవంతమైన సీఎం అధికారిక నివాసం, అమలు కాని పథకాలతో జనంలో పలచనైన కేజ్రీవాల్ ప్రతిష్ఠను కూడగట్టుకోవడం కష్టమే. పైగా కేంద్ర, రాష్ట్ర సర్కార్ల మధ్య పెనుగులాటలో ప్రజలు బాధితులవుతున్నారు. కుంటుబడ్డ పాలనతో కష్టాలు చవిచూస్తున్నారు. కేజ్రీవాల్ అవినీతి పరుడా, కాదా అన్నది తేల్చాల్సింది కోర్టు కాగా ప్రజాకోర్టులో నిజాయతీ సర్టిఫికెట్ తెచ్చుకుంటానని ఆయన చెప్పడం నాటకీయంగా బాగుంటుందే కానీ, నికరంగా ప్రజలకు ఒరిగేది శూన్యం. మరి ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మార్చుకుంటారని పేరున్న కేజ్రీవాల్ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో?

## "మహిళా వైద్యుల భద్రత మీ బాధ్యత".. బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం..



**న్యూఢిల్లీ,:** కోల్‌కతా వైద్యురాలి ఘటనపై ఈ రోజు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీరుపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు రాత్రి షిఫ్టులు కేటాయించడాన్ని నిరాకరిస్తున్నామని ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ని సీజేఐ విమర్శించారు. వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వానిది అని అన్నారు. కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో 31 ఏళ్ల వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటన తర్వాత ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ తీసుకువచ్చింది. "మహిళలు పనిచేయని మీరు ఎలా చెప్పగలరు..రాత్రి వేళ్లలో మహిళా వైద్యులకు రాయితీ అక్కర్లేదు..అదే షిఫ్టులో పనిచేయడానికి మహిళలు సిద్ధంగా ఉన్నారు" అని బెంగాల్ ప్రభుత్వం తరుపున కేసు వాదిస్తున్న కపిల్ సిబల్‌ని ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది. "మిస్టర్ సిబల్ మీరు దీన్ని చూడాలి. దానికి సమాధానం మీరు తప్పనిసరిగా భద్రత ఇవ్వాలి. పశ్చిమ బెంగాల్ నోటిఫికేషన్ సరిచేయాలి. భద్రత కల్పించడం మీ డ్యూటీ. మహిళలు రాత్రి పూట పనిచేయలేరు అని మీరు చెప్పలేరు. పైలట్లు, ఆర్మీ మొదలైనవి రాత్రి కూడా పనిచేస్తున్నాయి. " అని సీజేఐ అన్నారు. మహిళా వైద్యులు పరిస్థితి రాత్రిపూట పని చేయకపోవడం వారి కెరీర్‌కి విఘాతం కలిగిస్తుందని కోర్టు పేర్కొంది. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజ్ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగడంతో, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అలపన్ బంద్యోపాధ్యాయ మహిళా వైద్యుల భద్రతకు భరోసా ఇవ్వడానికి కొత్త చొరవను ప్రకటించారు. అన్ని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల వద్ద ఉమెన్-ఫ్రెండ్లీ భద్రతా సిబ్బందిని మోహరిస్తామని చెప్పారు. వైద్య కళాశాలలు, ఆసుపత్రుల వద్ద స్థానిక పోలీసులతో నిత్యం రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.రాత్రి విధుల విషయంలో మహిళా వైద్యులు జంటగా పనిచేసే విధంగా షిఫ్ట్‌లు ఏర్పాటు చేయబడతాయని చెప్పారు.

## ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు ముందు హిందూ దేవాలయంపై ఖలిస్తాన్ల దాడి



**న్యూఢిల్లీ,:** ప్రధాని నరేంద్ర మోదీ ఈ వారం అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. అంతకుముందే.. న్యూయార్క్‌లోని స్వామి నారాయణ్ ఆలయాన్ని ధ్వంసం చేశారు. అక్కడి గోడలపై భారతదేశానికి వ్యతిరేకంగా నినాదాలు కూడా వ్రాయబడ్డాయి. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు ముందు ఇలాంటి చర్యలు చేపట్టడం ఒక మెసేజ్ గా పరిగణించబడుతుంది. ఆలయంలో విధ్వంసం వెనుక ఖలిస్తానీలే ఉండవచ్చని ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఈ దాడిపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమం జరగనున్న న్యూయార్క్ నగరంలో ఈ దాడి జరిగింది. ఈ ఈవెంట్ లాంగ్ ఐలాండ్‌లో జరగనుంది. ముఖ్యంగా దేవాలయాలపై దాడులు చేయడం, భారత వ్యతిరేక నినాదాలు రాయడం ఖలిస్తానీ శక్తులకు అలవాటు. లాంగ్ ఐలాండ్ ప్రాంతంలో కూడా చాలా చోట్ల భారత వ్యతిరేక పోస్టర్లు కనిపించాయని వర్గాలు చెబుతున్నాయి. అక్కడ నివసిస్తున్న భారతీయ సంతతికి చెందిన వారు కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. న్యూయార్క్‌లోని మెల్‌విల్లేలోని స్వామి నారాయణ్ ఆలయంలో సెప్టెంబర్ 15 రాత్రి ఈ దాడి జరిగింది. ఈ ప్రదేశం ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యక్రమ వేదిక నుండి 26 కిలోమీటర్ల దూరంలో ఉంది. సెప్టెంబర్ 22న ఇక్కడ భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. ఈ ఘటన భారత్-అమెరికా మధ్య సంబంధాలపై కూడా ఆందోళన రేకెత్తించింది. కెనడా, అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఖలిస్తానీ అంశాలు క్రియాశీలకంగా మారడంపై భారత్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు అమెరికాలో మరో ఘటన భారత ఏజెన్సీల అనుమానాలకు బలం చేకూర్చింది. ఈ ఏడాది అమెరికాలో హిందూ దేవాలయంపై దాడి జరగడం ఇది మూడోసారి. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ దీనిపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా చేస్తున్న అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలు కాపాడాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. దాడి జరగడం బాధాకరం అయినా శాంతిభద్రతలు కాపాడాలంటూ దేవస్థానం తరపున ఓ ప్రకటన విడుదల చేశారు. ద్వేషం, అసహనానికి వ్యతిరేకంగా ఇది మా సమాధానం. ద్వేషపూరిత నినాదాలతో ఆలయంపై దాడి చేశారు. దురదృష్టవశాత్తు, అమెరికాలో ఒక ఆలయంపై ఇలా దాడి జరగడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు కూడా ఈ ఏడాది ఇలాంటి ఘటనలు మరో రెండు జరిగాయి. ఖలిస్తానీ గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు భారత ఏజెన్సీలు కుట్ర పన్నాయని అమెరికా ఆరోపించడం గమనార్హం. ఇది కూడా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను సృష్టించింది. భారతదేశం దానిని తిరస్కరించింది.

## 'స్వచ్ఛత సేవ' కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు..



**అమరావతి,:** స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలోని కెపిహెచ్బి కాలనీ లోని పార్క్ లో చెత్తను శుభ్రపరిచారు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రమగా ఉంటే మనసు కూడా పరిశుభ్రంగా ఉంటుంది. స్వచ్ఛ భారత్ ప్రోగ్రాం 10 సంవత్సరాలు క్రితం మోడీ గారు ప్రాంభించారు. శ్రీకాకుళం స్వచ్ఛభారత్ లో టాప్ 10 లో ఉంచాలని లక్ష్యం పెట్టుకోవాలి., అంత పెద్ద వరద వచ్చిన తరువాత 10 రోజుల్లో నార్మల్ స్థితికి తీసుకురావడం కేవలం నారా చంద్రబాబు వలనే అవుతుంది అని నిరూపించారని ఆయన అన్నారు. విజయవాడ వరదల్లో సామాన్యుడులా భరోసా ఇస్తూ తిరిగారు. ప్రభుత్వం ఇంత కష్టపడి చేస్తుంటే ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. ప్రతిపక్షాలు ప్రజలకు బయబ్రాంతులకు గురిచేసి రాజకీయం చేస్తున్నాయి. ఎన్ని రాజకీయాలు చేసిన వాళ్ళ పప్పులు ఎక్కడ ఉడకడం లేదు. కాబట్టి సహించుకోలేకపోతున్నారు. ఎలక్షన్ రిజల్ట్ లో బుద్ది చెప్పినా.. వాళ్ళ స్టైల్ మార్చుకోకుండా ఇలా చేస్తే.. ఉన్న 11 ఎమ్మెల్యే లు ఉంటాయో లేదో డౌటే అని వ్యాఖ్యానించారు. టీడీపీ హయంలోనే ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వచ్చాయి. జగన్మోహన్ రెడ్డి చేసింది ఏమి ఉంది..? టీడీపీ తెచ్చిన కాలేజీలకు యన్టిఆర్ పేరూ ఉందని పేరును మార్చారు. కాలేజీల పట్ల, ఎడ్యుకేషన్ పట్ల దుర్మార్గంగా వ్యవహరించారు. పెద్దవాళ్ళకి ఫీజ్ రియంబర్స్మెంట్ రాకుండా విద్యార్థులకు, వాళ్ల తల్లిదండ్రులకు కాలేజీల చుట్టూ తిరిగేలా చేశారు. ఆ విషయాన్ని ఇప్పుడు మంత్రి లోకేష్ చక్కబెడుతున్నారు. ప్రతిపక్షాలు ఎన్ని రాజకీయాలు చేసిన రాష్ట్రాన్ని ప్రగతి పదంలో తీసుకుపోతాం అని ఆయన తెలిపారు.

## బాలాపూర్ లడ్డూను ప్రధాని మోడీకి అందిస్తాం..



వేలంలో బాలపుర్గణేష్ లడ్డూలు రావడం చాలా సంతోషంగా ఉందని బీజేపీ నేత కొలను శంకర్ రెడ్డి అన్నారు. వేలంలో లభించిన లడ్డూను ప్రధాని నరేంద్ర మోడీకి బహూకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎలాగైనా లడ్డూను దక్కించుకోవాలని వేలంలో పాల్గొన్నానని తెలిపారు. అదృష్టవశాత్తూ 2024లో రూ.30,01,000లకు సొంతం చేసుకున్నట్లు కొలను శంకర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో 31వ సారి బాలాపూర్ గణేష్ లడ్డూ వేలంలో కొలను శంకర్ రెడ్డి విజేతల జాబితాలో చేరారు. బాలాపూర్ లడ్డూను 2024లో రూ.30,01,000లకు కొలను శంకర్ రెడ్డి దక్కించుకోవడంతో వేలం పాట చరిత్రలో బాలాపూర్ లడ్డూ ఏడు రికార్డులను బద్దలు కొట్టింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బాలాపూర్ గణేష్ లడ్డూ వేలంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ తీగల హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాలాపూర్ లడ్డూ వేలం పోరుగా కొనసాగింది. వేలం రూ.1016తో ప్రారంభమైంది. 44 వసంతాల గణేష్ వార్షికోత్సవాల్లో భాగంగా గత 30 ఏళ్లుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బాలాపూర్ గణేష్ లడ్డూ వేలానికి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితికి గడచిన 30 ఏళ్లలో లడ్డూ వెలం పాటలో 1,82,51,950 కోట్ల రూపాయలు ఉండగా, అందులో 1,58,07,970 కోట్ల రూపాయలతో బాలాపూర్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ గతేడాది 2023లో జరిగిన వేలంలో బాలాపూర్ గణేష్ లడ్డూను దక్కించుకున్న దాసరి దయానంద్ రెడ్డి రూ. 27 లక్షల నగదును గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డికి అందజేశారు. నగదు బహూకరించిన దాసరి దయానంద్ రెడ్డికి గణేష్ ఉత్సవ సమితి తరపున లక్ష రూపాయల విలువైన బంగారు గొలుసును అందజేశారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి నిమజ్జన పూజలు ప్రారంభమయ్యాయి.

# సెప్టెంబర్ 17 విలీనం కాదు.. విమోచనమే..!



అధికార మదంతో పొగరెక్కిన నిజాం నవాబుకు దడపుట్టించారు. దోపిడికి కాలం చెల్లిపోతుందనే భయంతో.. అరాచకాలు సృష్టించిన గడీల పాలనకు చరమగీతం పాడారు. బారు ఫిరంగులు మోగినా, తుపాకీ తూటాల వర్షం కురిసినా ఎత్తిన జెండా దించలేదు. రవ్వంత స్ఫూర్తిని కూడా తగ్గనివ్వలేదు. బలిదానాలు చేసి మరీ సాయుధ పోరాటానికి ఊపిరిలూదారు. రజాకార్ల ఆకృత్యాలను మూకుమ్మడిగా ఎదుర్కొన్నారు. 1947 ఆగస్టు 15 బ్రిటీష్ పాలన అంతమై.. భారతదేశం స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంది. అయితే దేశం నడి మధ్యలో ఉన్న హైదరాబాద్ మాత్రం నిజాం పాలనలోనే ఉంది. హైదరాబాద్ సంస్థానం స్వేచ్ఛవాయువు పీల్చుకోవడానికి.. ఏడాదికి పైగా సమయం పట్టింది. వెళ్తూ.. వెళ్తూ.. బ్రిటిష్ వారు పెట్టిన మెలికే ఇందుకు కారణమైంది. సంస్థానాలు.. భారత యూనియన్‌లో ఇష్టమైతే కలవొచ్చు అని వారు చెప్పిన మాటే.. నిజాం రాజుకు అవకాశంగా మారింది. హైదరాబాద్ స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించుకున్నాడు ఏడో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్. ఈ సమయంలోనే తన రాజ్యం చేయి జారిపోతుందనే ఆలోచనతో పాకిస్తాన్ సాయం కోరాడు. ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించాడు. దీనిని సహించని.. భారత ప్రభుత్వం హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో కలుపుకోవాలనుకుంది. అప్పటి కేంద్రం హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రాజ్యంపై పోలీస్ చర్యకు దిగాలని నిర్ణయించారు.

### జాతీయ జెండా ఎగురవేయాలని..

1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుంచి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటికీ స్వేచ్ఛ వాయువు అందని.. నిజాం రాజ్యంలోని ప్రజలు.. కొన్ని గ్రామాల్లో జాతీయ జెండా ఎగరవేయాలని నిర్ణయించారు. వాటిని అణగదొక్కేందుకు నిజాం ప్రత్యేక సైన్యమైన ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా వందల మంది వీరులు ప్రాణాలు కోల్పోయారు. 1947 సెప్టెంబర్ 2న వరంగల్ జిల్లాలోని పరకాలలో జాతీయ పతాకం ఎగురవేయలని నిర్ణయించారు. కానీ, వారిపై రజా కార్లు కాల్పులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనలో అక్కడ 22 మంది అమరులయ్యారు. ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలోని వీర బైరాన్‌పల్లి యోధులు.. రజాకార్ల దురగతాలకు వ్యతిరేకంగా పోరు చేశారు. బైరాన్‌పల్లి గ్రామ రక్షకదళం.. రజాకార్లపై ఎదురొడ్డి ప్రతిదాడులు చేశారు. దీంతో వారిపై ప్రతికారం తీర్చుకునేందుకు సుమారు 12 వందల మంది రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టారు. ఈ దాడిలో 25 మంది రజాకార్లు 118 మంది గ్రామస్తులు మృతి చెందారు. ఇలా స్వాతంత్ర్య భారతంలో కలిసి స్వేచ్ఛా వాయువు పీల్చుకోవాలనుకున్న గ్రామాల్లో రజాకార్లు దాడులు చేసి హింసించేవారు.

### నిరంకుశానికి వ్యతిరేకంగా పోరాడి..

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆదిలాబాద్ అడవుల్లో ఆదివాసీల ఆత్మగౌరవం కోసం పోరాడిన కొమరం భీంను మట్టుబెట్టారు. అడవి బిడ్డలకు అండగా నిలిచి రజాకార్ల ఆగడాలను ఎదురొడ్డి పోరాడిన రాంజీ గోండును ఉరితీసారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఎదిరించి రజాకార్లను తరిమి కొట్టిన వీర వనిత చాకలి ఐలమ్మ కుటుంబాన్ని కిరాతకంగా హింసించారు. తన పత్రికతో నిజాం నవాబుకు ముచ్చెమటలు పట్టించిన షోయబుల్లా ఖాన్‌ను పట్టపగలు హైదరాబాద్‌లో చేతులు నరికి చంపారు. ప్రజలను హింసిస్తున్న నిజాంపై బాంబు వేసిన విద్యార్థి నారాయణ పవార్‌కి ఉరిశిక్ష వేశారు. వరంగల్లో జాతీయ జెండా ఎగురవేసినందుకు మొగిలయ్యగౌడ్‌ను నరికి చంపారు. తమ కవిత్వం, పాటలతో ప్రజా ఉద్యమానికి ఊపిరిలూదిన దాశరథి, కాళోజీ లాంటి వాళ్లని జైలుపాలు చేశారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఈ వీరుల గాథలు నేటి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఈ పాలకులకు లేదా?

### సాయుధ పోరాటం ఎవరికోసమంటే?

అయితే కమ్యూనిస్టులలో కొందరు నిజాంకు వ్యతిరేకంగా కొంత ప్రయత్నించినా చివరకు నిజాంతో కుమ్మక్కై ప్రజలందరూ స్వాగతం పలికినా 'ఆపరేషన్ పోలో'కు వ్యతిరేకంగా పనిచేసి చరిత్రహీనులుగా మిగిలిపోయారు. ఇక్కడ పెద్ద ప్రశ్న ఏంటంటే తెలంగాణ సాయుధ పోరాటం (1946-1951) వరకు జరిగితే 1948లో భారత్ 'పోలీసు చర్య'కు నిజాం లొంగిపోయిన తర్వాత కూడా 1951 వరకు సాయుధ పోరాటం కొనసాగిందంటే కమ్యూనిస్టులు చెప్పుకునే సాయుధ పోరాటం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కానే కాదని స్పష్టమవుతుంది. భూస్వాముల పేరుతో ప్రజలను దోచుకోవడానికే కమ్యూనిస్టుల పోరాటం సాగిందన్నది చారిత్రక సత్యం.

### వివిధ సమాధానాలు ఉన్నప్పటికీ..

సెప్టెంబర్ 17ను ఏ విధంగా పరిగణించాలనే చర్చ మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న కాలంలో ప్రారంభమైంది. అంతముందు ఈ చర్చ అంతగా లేదు. అతివాద వామపక్ష భావవాదులు సెప్టెంబరు 17ను విద్రోహ దినంగా పరిగణించాలని వ్యాఖ్యానిస్తే, మితవాదులు దాన్ని విమోచన దినంగా పాటించాలనడం, మధ్యేయవాదులు దాన్ని విలీన దినంగా పరిగణించాలనడం జరుగుతుంది. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా సెప్టెంబర్ 17కు సమాధానాలు చెబుతున్నారు. కానీ నూటికి నూరు శాతం ఇది మనకు నిజాం నవాబ్ నుంచి వచ్చిన విమోచనమే. కాబట్టి మనం దీనిని విమోచన దినంగా పరిగణించాలి.

# చరిత్రలో రాయబడని గాథలెన్నో...!



"బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రమొచ్చెనని ఈ గడ్డ పులకించినది. గాంధీ హత్య వార్త తెలుసుకుని బాపూ బాపూయని ఈ భూమి విలపించినది. కానీ మా భూమిపై జరుగుతున్న అకృత్యాలకు మీరెందుకు స్పందించడం లేదని ఎవ్వరినీ నిష్టూరమాడని కర్మభూమి ఇది"

విలీన దినమా, విద్రోహ దినమా, విమోచన దినమా

బ్రిటీష్ వారి నుంచి స్వాతంత్ర్యం పొందిన ఆగష్టు 15న దేశమంతా జాతీయ జెండాలు ఎగరేసి, దేశంకోసం పోరాడిన మహానీయుల్ని స్మరించుకుని నివాళులర్పించుకోవటం కనీస బాధ్యతగా భావించుకుంటాం. సెప్టెంబర్ 17 విలీన దినమా, విద్రోహ దినమా, విమోచన దినమా అని మేధావులు పడే తర్జన భర్జనలతో పాటు అసలు జరపాలా, జరపరాదా అనే మీమాంసలు సాగుతూండగానె ఆరోజు వల్లభాయ్ పటేల్ ఫోటోలతో జాతీయ జెండాలు ఎగరేయడంతో పాటు హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్లో విలీనమవటానికి, నిజాం తలొంచటానికి కారణం కేవలం పటేల్ చొరవ, ధైర్యం అనే విధంగా ప్రచారం జరిగిపోతోంది. ఇది అనాడు ఆయుధాలు చేతబట్టినవాళ్ల, ప్రాణాలను కోల్పోయిన వాళ్ల త్యాగాలను విస్మరించడమేనని నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని జైలు జీవితం తర్వాత రహస్య జీవితం గడిపిన జైని మల్లయ్య గుప్త లాంటి ఎందరో ఉద్యమకారుల వేదన.

ఆ పోరాటం ఆధునిక వీర భారతం

ఆపరేషన్ పోలో 1948 సెప్టెంబర్ 13న ప్రారంభం కాకముందే తెలంగాణలో భూస్వామ్య చిహ్నాలయిన గడీలు కూల్చబడి మొండిగోడలతో శిధిల వ్యవస్థకు సాక్షులుగా మిగిలాయి. వేలాది గ్రామాలు విముక్తమయ్యాయి ఆయా గ్రామాల్లో ఎన్నికల ద్వారా కమిటీలు ఏర్పాడ్డాయి. ఆ కమిటీలతో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయి. జనగామ దేశ్‌ముఖ్ విసునూరి రామచంద్రారెడ్డికి చెందిన 40 వేల ఎకరాలతోపాటు వేలాది గ్రామాల్లో పేదలకు పంచిన భూమి షుమారు పది లక్షల ఎకరాలు. భూస్వామ్యం నుంచి నేరుగా సోషలిజానికి తీసుకువచ్చే క్రమంలో రైతులు జరిపిన పోరాటం తెలంగాణ సాయుధ పోరాటంగా భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధికక్కడంతో పాటు దేశ కమ్యూనిష్టు ఉద్యమచరిత్రలో స్వతంత్ర ప్రతిపత్తిగల ఉద్యమంగానూ నిలిచింది. శ్రమ దోపిడీ, వెట్టి చాకిరీ వంటి సామాజిక దురాచారాలపై సంఘటితమైన ప్రజల ఆవేదన ఉద్యమంలా మారింది. తెలంగాణ ప్రాంతంలో 1946-51 మధ్య జరిగిన ఉద్యమం గురించి కెనడాకు చెందిన రచయిత కాంట్‌వెల్‌స్మిత్ 1962లో 'ది మీనింగ్ అండ్ ఎండ్ ఆఫ్ రిలీజియస్' అనే పుస్తకంలో పేర్కొన్నారు. రష్యన్, పోలిష్, స్పానిష్ భాషల్లో ఈ పోరాటానికి సంబంధించి అనేక కథలు, కవిత్వాలు వచ్చాయి. వీటి ద్వారా ఆధునిక వీరభారతంగా పేర్కొనే తెలంగాణ సాయుధ పోరాటం అంతర్జాతీయంగా పొందిన గుర్తింపుని మనం అర్థం చేసుకోవచ్చు.

సాయుధ పోరాటం అలా మొదలై...

1948 సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటు ప్రకటన తర్వాత కలకత్తాలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో వారి నాయకుడు రణదివే ఆలోచన మేరకు తెలంగాణలో కమ్యూనిష్టు పాలన కోసం సాయుధ పోరాటాన్ని కొనసాగించారు. శాంతి భద్రతల రక్షణ పేరుతో కమ్యూనిస్టు పార్టీని నిషేధించడమే కాక హోంమంత్రి పదవిలో ఉన్న వల్లభాయ్ పటేల్ హైదరాబాద్‌లో ఒక్క కమ్యూనిస్టు కూడా లేకుండా చేస్తానని ప్రకటించడంలో 18 నెలల పాటు అడవులనుంచే కమ్యూనిస్టులు ఉద్యమం సాగించారు. పగలు పోలీసు బృందాల గాలింపు చర్యలు, రాత్రుళ్ళు గెరిల్లా పద్ధతుల్లో కమ్యూనిస్టుల దాడుల మధ్య ప్రజాజీవనం కల్లోలమయింది. సరిగ్గా మూడేళ్ల తర్వాత 1951 సెప్టెంబర్‌లో కమ్యూనిస్టులు సాయుధ పంథాను వీడి ప్రజాసామ్య మార్గంలోకి రావటానికి ఒప్పుకోవడంతో అప్పటి వరకు కమ్యూనిస్టు పార్టీపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. 1952లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన కమ్యూనిస్టులు 14 స్థానాల్లో గెలిచారు. నల్గొండ పార్లమెంట్ నుంచి పోటీ చేసిన ఉద్యమ నాయకుడు రావి నారాయణ రెడ్డి నాటి ప్రధాని నెహూ కన్న ఎక్కువ మెజారిటీ పొందడంతో నెహ్రూ చొరవతో అప్పటి పార్లమెంట్ భవనంలో తొలి అడుగు వేసిన ఘనత తెలంగాణ సాయుధ పోరాట నాయకుడికి దక్కింది.

ఆ మూడేళ్ల అకృత్యాలకు బాధ్యులెవరు?

ఇక్కడ ముఖ్యంగా చర్చించుకోవలసినది 1948 సెప్టెంబర్ 17న పోలీస్ చర్య పేరుతో జరిగిన సైనిక చర్య పూర్తయినా హైదరాబాద్ రాజ్యం కాలేదు. సైనిక పాలన మొదలై మూడేళ్ళ పాటు కొనసాగింది. నిజాం పాలన అనగానే గుర్తుకొచ్చే దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, దొరల దుర్మార్గాలు ఆ వెంట ఖాసిం రజ్వీ అతడి సైన్యమైన రజాకార్లు వాళ్ళ పైశాచిక చేష్టలు చరిత్రలో లిఖించపడ్డాయి. కానీ ఆ విషాదాలకు, విశ్ఛంఖతలకు మించి యూనియన్ ప్రభుత్వం తన సైనిక పాలనలో నియమ నిబంధనలు, శాసనం చట్టం లాంటి విషయాలను పూర్తిగా మరచిపోయింది. సర్దార్ పటేల్ అభీష్టమైన కమ్యూనిస్టుల అణచివేత పేర ప్రజలపై మధ్యయుగాలను మరిపించే దౌర్జన్యాలకు, నీచాతినీచ కృత్యాలకు దిగిన వైనాన్ని నాజీలను మించేలా ఏర్పర్చిన కాన్సంట్రేషన్ క్యాంపులు, జరిపిన అత్యాచారాలు, చేసిన పిశాచకృత్యాలను వాటి గురించి తెలుసుకునీ కిమ్మనని స్వతంత్ర భారత ప్రజ, దేశ నేతల గురించి దాశరథి రంగాచార్య తన 'జీవనయానం' పుస్తకంలో ప్రసావించారు. అప్పటికే బలహీనపడ్డ నిజాం లొంగుబాటు గొప్పదనం పటేల్‌కి కట్టబెట్టేవారు ఆ మూడేళ్ల కాలంలో జరిగిన అకృత్యాలకు బాధ్యులెవరో చెప్పాల్సి ఉంటుంది. అయినా దేశంలో ఆనాడున్న 560 సంస్థానాల గాటన తెలంగాణను కట్టడం అత్యంత అవివేకం, అవగాహన రాహిత్యం.

నూటపదహార్లు వెనుక చరిత్ర ఇదీ!

బ్రిటీష్ ఇండియా కరెన్సీ రూపాయి కాగా హైదరాబాద్ రాజ్య కరెన్సీగా ఉస్మానియా సిక్కా ఉండేది. 7 ఉస్మానియా సిక్కాలు 6 బ్రిటీష్ రూపాయలకు సమానం. పూజాది కార్యక్రమాల్లో బ్రాహ్మణుల కోరిక మేరకు వారికి దక్షిణగా హైదరాబాద్ ప్రాంతం వారు 116 ఉస్మానియా సిక్కాలు ఇచ్చేవారు. ఎందుకంటే అది బ్రిటిషిండియా కరెన్సీకి నూరు రూపాయలతో సమానమవుతుందని. ఇప్పుడు నిజాము లేడు. అతని ప్రభుత్వమూ, కరెన్సీ ఏవీ లేవు కానీ వందా, వేయి, లక్ష ఏదైనా చివర నూట పదహార్లు మాత్రం తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయమై ఉండిపోయింది. నూట పదహార్ల వెనకున్న కారణం తెలియకపోవడం తప్పేమికాదు. అసలు చరిత్ర తెలియకున్నా దోషమేమీ కాదు. కానీ చరిత్రను ఏమార్చాలనుకోవడం, అర్థసత్యాలను, అసత్యాలను చరిత్రగా ప్రచారం చేయడం దుర్మార్గం.

తెలంగాణ వీర గాథల్ని సగర్వంగా చాటుదాం

యుద్ధంలో ఫ్రాన్స్ కవులంతా చెల్లాచెదురుగా పారిపోతే దేశంలో నిలబడి ప్రజలకోసం గీతాలు రాసిన లూయి ఆరగాన్ గురించి ప్రపంచం గొప్పలు చెప్పుకుంటుంటే ఇక్కడ ఉద్యమంలో పాల్గొంటూనే ప్రజలకోసం, కలమెత్తిన, గళమెత్తిన కవులు దాశరథి సోదరులు, వట్టికోట ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజి, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి లాంటి ఎందరో ప్రజాకవుల గురించి మనమెంత గొప్పగా చెప్పుకోవాలి? జారుచక్రవర్తిపై రష్యాలో నాడు తిరుగుబాటు చేసిన నాయకులు, ప్రజాకవులు, ప్రజలకు సరితూగగల తెలంగాణ సాయుధ పోరాట గాథల గురించి సెప్టెంబర్ 17న సగర్వంగా చాటుకుందాం.

# దేవరగట్టు కానివ్వద్దు



తెలంగాణ దేవరగట్టు కారాదు. కర్నూలు జిల్లాలో అదొక నమ్మకం. విజయదశమి రోజు రక్తం చిందేలా జనం ఒకరి తలలు ఒకరు పగులకొట్టుకుంటారు. ఆ రక్తం శివుడికి అభిషేకమవుతుందని, ఆ విధంగా తమకి పుణ్యలోకాలు సంప్రాప్తిస్తాయని వారి ఆశ. నమ్మకమూను. దాన్లో గెలుపోటములుండవు. ఏ ఆటకైనా, పాటకైనా, చివరికి 'జల్లికట్టు'లోనైనా ఎద్దు మూపురం పట్టి ఆపగలిగిన యువకుడిని గెలిచినట్టు ప్రకటిస్తారు. దేవరగట్టులో ఆడే 'దేవరకర్ర' వీటన్నింటికీ భిన్నం. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్లు ఆడుతున్న ఆటను రాష్ట్ర ప్రజానీకం అనుమతిస్తే తెలంగాణ దేవరగట్టవుతుంది. ప్రజలు, ప్రజాసమస్యలు వెనక్కిపోయాయి. దీనికి పరాకాష్ట పీఏసీ (ప్రజాపద్దుల కమిటీ) పేర జరుగుతున్న లొల్లి. గోడదూకిన 'పుంజు' మెడలో వరమాల వేయడం సరైందా? కాదా? అని రేపు కోర్టులు తేలుస్తాయి. సాంప్రదాయాలకు భిన్నమైందా కాదా కూడా తెలుస్తుంది. 2023 డిసెంబరులో తగిలిన షాక్ నుండి తాను తేరుకునేలోగా పోగేసిన ఆ 38 మందిలో నుండి ఎవరూ గోడదూకకుండా చూసుకునేందుకు కేసీఆర్ అవలంభించిన తేలిక పద్ధతి - రేవంత్ సర్కార్ వారమని ఒకసారి, నెలరోజుల్లో పడిపోతుందని ఒకసారి చెప్తూ వచ్చారు. దానికి కారణం 'గ్రాండ్ ఓల్డ్ పార్టీ' (కాంగ్రెస్) ఆకర్షణకు లోనుకాకుండా చూసుకోవడమే! అయినా, పదవులు, దాంతో సంప్రాప్తించే పైసల కోసం దేనికైనా దిగజారేవారు బూర్జువా పార్టీల్లో కావల్సినంత మంది కదలాడే రోజుల్లో కదా వున్నాం మనం. 2014లో ఒకసారి టీఆర్ఎస్కు గెలిచిన స్థానాలకంటే వాపొచ్చింది. 2018లో కేసీఆర్ టీడీపీ తరపున గెలిచిన వారందరిని గుటకాయ స్వాహా చేశారు. కాంగ్రెస్ని 19 నుండి ఆరుకు తెచ్చారు. అప్పుడు టీఆర్ఎస్ మిత్రపక్షం ఎంఐఎంకి పీఏసీ చైర్మెన్ పదవి ఇచ్చారు. నాడు టీడీపీ తరపున గెలిచి గులాబీ కండువా కప్పుకున్న ఈ అరెకపూడి గాంధీ 'మహాత్ముడే' నేడు గులాబీ వనంలో నుండి హస్తం గూటికి చేరాడు. ఈయనకు ముందూ, వెనుకా గోడదూకేసిన జంప్ జిలానీలున్నారు. కొందరు 'గోపి'లుగా నిలబడి ఉన్నారు. దీనికి ప్రధాన కారణం అసలా పార్టీకి భవిష్యత్ ఉంటుందా అన్న సందేహం. దానికి కారణం - రాష్ట్రంలో వరదలొచ్చి - జిల్లాల్లోని - మండలాలు ప్రభావితమైనా మూల విరాట్ ఫామ్హౌస్లో నుండి బయటికి రాకపోవడం. గతంలో చేసిన సహస్ర చండీయాగాలు నిరుపయోగమూ, నిష్ప్రయోజనమూ కాగా తాజాగా మరో యాగానికి సిద్ధమయ్యారు తప్ప, ప్రజల్లోకి మాత్రం రావటం లేదు. ఈ పది నెలల్లో వీరికి ప్రజా సమస్యలు పట్టలేదు. కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదని అడగాలంటే పదేళ్ళు నువ్వేం చేశావని కార్మికులు అడగరా? ఆర్టీసీ కార్మికుల్ని అణగదొక్కేస్తున్నారనాలంటే నువ్వేగా ఆ పని చేసిందని టీఆర్ఎస్ అభిమానులు సైతం ఆర్టీసీలో కారాలు, మిరియాలు నూరుతున్నారు. రుణమాఫీ గురించి కాంగ్రెస్పై నానాయాగీ చేసే బీఆర్ఎస్ నేతలు ఆ విషయంలో తన రికార్డు ఒకసారి చూసుకోవడం మంచిది. ఒకేసారి లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని ప్రకటించి నాలుగో ఏడాది రూ.99,999లు రుణమాఫీ పూర్తిచేసింది. అయితే దీన్లో కాంగ్రెస్ ఉద్ధరించింది కూడా ఏమీ లేదు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు పూర్తి చేస్తామన్నారు. మూడు వందల రోజులైనా ఇంకా ఒక కొలిక్కి వచ్చే పరిస్థితి లేదు. రుణమాఫీపై ముఖ్యమంత్రి చెప్పేదానికి ఇతర మంత్రులు చెప్పేదానికి వ్యత్యాసాలున్నాయని అన్ని పార్టీలు, రైతు సంఘాలు మొత్తుకుంటున్నాయి. అసలిదొక బ్రహ్మపదార్థంలా తయారైంది. కార్మికుల సమస్యలూ, రైతాంగ సమస్యలూ, కౌలు రైతుల, వ్యవసాయ కూలీల సమస్యలూ లేవనెత్తి ఆందోళన చేయగల సత్తా బీఆర్ఎస్కుగాని, బీజేపీకిగాని రాష్ట్రంలో లేదు. తమ పదేళ్ల పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉంటే ఈ పది నెలల్లో భ్రష్టుపట్టి పోయినట్టు హిజ్ మాస్టర్స్ వాయిస్లో పుంఖానుపుంఖాలుగా వార్తలు, వ్యాసాలు వండి వారుస్తున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన కుల దురహంకార హత్యలు రాష్ట్రంలో ఎన్నడూ చూసెరుగం. శ్రుతి, సాగర్ల ఎన్కౌంటర్తో ప్రారంభమై అనేకచోట్ల ఎన్కౌంటర్లు, ఖమ్మంలో మరియమ్మ హత్య, కోదండరామ్ సార్ ఇంటి తలుపులు బద్దలు కొట్టిన పోలీసులు ఆయనకు అరదండాలు వేయడం రాష్ట్రం ఆశ్చర్యపోయి చూసింది. కొన్ని సంఘాల హాల్ మీటింగులను సైతం నిషేధించారు. నేరెళ్ళలో దళితులపై ఇసుకమాఫియా దాడి రాష్ట్రం మరిచిపోలేదు. రోహిత్వేముల ఆత్మహత్య, మధుకర్, ప్రణరు హత్య వంటివి చూసిన తర్వాత కూడా రాష్ట్రం సస్యశ్యామలంగా ఉన్నట్టు బీఆర్ఎస్ నేతలకనిపించడం ఆశ్చర్యకరం. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలువేసి రోడ్లపై నడిపించిన ఘటన రైతాంగాన్ని కలచివేసింది. రాష్ట్రంలో మత ఘర్షణలు జరగకుండా ఆపటం మంచి విషయమే. కాని ప్రజలపై సాగిన నిర్బంధం, చివరికి ధర్నాచౌక్ రద్దు వంటి వాటిపై కేసీఆర్ అండ్ కో ఏమి సమాధానం చెప్తారు? అంతమాత్రం చేత కాంగ్రెస్ పాలనేదో గొప్పగా ఉందని చెప్పలేం. కాంగ్రెస్ ఇచ్చిన, ఇస్తున్న వాగ్దానాలనేకం ఇంకా అమలుకు నోచుకోకపోవడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాల దశ, దిశ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.